కొత్త జీపీలుగా ప్రకటన పట్ల హర్షం

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్ (లింగంపేట్)

నాగిరెడ్డిపేట్ మండలంలోని కన్నారెడ్డి, చిన్న ఆత్మకూర్ గ్రామాన్ని నూతన గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేయడంతో రెండు గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి కెసిఆర్, ఎమ్మెల్యే సురేందర్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ఒకరికి ఒకరు మిఠాయిలు తినిపించుకున్నారు. నూతన గ్రామపంచాయితీల ఏర్పాటుకు కృషి చేసిన నియోజకవర్గ సీనియర్ నాయకులు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రతాపరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.


సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే చిత్రపటానికి పాలాభిషేకం

నవతెలంగాణ

నిజామాబాద్-కామారెడ్డి

1

సోమవారం 07 ఆగస్టు 2023

సిద్దుల గుట్టపై ధ్యానం

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని సిద్దులగుట్ట నవనాథ సిద్దేశ్వర పిరమిడ్ ధ్యాన క్షేత్రం వద్ద ఆదివారం ధ్యాన కార్యక్రమాన్ని నిర్వహించారు. పీస్ఆఫ్ మైండ్ స్వామి మాట్లాడుతూ అన్నిటిలో కెల్లా ధ్యానం చాలా గొప్పదని ప్రతి ఒక్క వ్యక్తి ప్రతిరోజు ధ్యానం చేయాలని సూచించారు. జిల్లా కేంద్రానికి చెందిన సీనియర్ పిరమిడ్ మాస్టర్ డాక్టర్ నీలిమ మాట్లాడుతూ ధ్యానం ఆరోగ్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో పి ఎస్ ఎస్ ఎం నవనాథపురం కమిటీ సభ్యులు అడ్వకేట్ సాయి కృష్ణారెడ్డి , తిరుమల గంగారం, జమలగిరి నరసయ్య, జీకే రమేష్ ,నారాయణ అమరవాజి శ్రీనివాస్, రాజారాం సీనియర్ పిరమిడ్ మాస్టర్లు బొడ్డు దయానంద్ సాయిబాబా చిదుర, ధ్యానులు పాల్గొన్నారు.




నినాదాలు చేస్తున్న సీపీఐ(ఎం) నాయకులు, గిరిజన పేదలు

సీపీఐ(ఎం) నాయకునిపై దాడి చేసిన భూస్వాములను శిక్షించాలి

- వారి నుంచి ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకొని పేదలకు పంచాలి
- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వెంకట్ గౌడ్ డిమాండ్

నవతెలంగాణ-గాంధారి

సీపీఐ(ఎం) నాయకుని పై దాడి చేసిన భూస్వాముల గూండాలను కఠినంగా శిక్షించాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వెంకట్ గౌడ్ డిమాండ్. ఆదివారం గాంధారి మండల కేంద్రంలో పార్టీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వెంకట్‌గౌడ్, ఏరియా కార్యదర్శి మోతీరాం నాయక్ మాట్లాడుతూ భూమి లేని పేదలకు భూమి కావాలని కోరుతూ మాత్ సంఘం గ్రామంలోని పేద రైతులు గ్రామ శివారులో ఉన్న ప్రభుత్వ భూములను పంచాలని సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో అధికారులకు వినతి పత్రం అందజేసినట్టు తెలిపారు. ఆ భూమిని నలుగురు బడా భూస్వాములు ఒక్కొక్కరు సుమారు 30 ఎకరాల చొప్పున కబ్జా చేసుకొని చదును చేసి ఏడానికి మూడెకరాల చొప్పున అమ్ముకుంటున్నారని ఆ భూమిని సర్వే చేపట్టి పేదలకు పంచాలని సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో అధికారులకు దరఖాస్తు పెట్టినట్టు తెలిపారు. దీంతో ఆగ్రహించిన భూస్వాములు కొంతమంది గుండాలతో సీపీఐ(ఎం) మండల నాయకుడు కమ్మరి సాయిలుపై దాడి చేయించినట్టు తెలిపారు. గత వారం రోజుల క్రితం ఒక కార్యకర్తపై కూడా దాడి చేయించినట్టు తెలిపారు. దాడి చేసిన వారిని, చేయించిన వారిని కఠినంగా శిక్షించాలని అదేవిధంగా భూస్వాములు ఆక్రమించుకున్న భూములను వారి చెర నుండి ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వ భూమిని.. భూమి లేని నిరుపేదలకు ఒక్కో కుటుంబానికి 1 ఎకరం చొప్పున 150 కుటుంబాలకు పంచాలని డిమాండ్ చేశారు. లేకపోతే పార్టీ ఆధ్వర్యంలో భూ పోరాటాలు నిర్వహించి భూములు పేదలకు పంచుతామని స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు కమ్మరి సాయిలు, మధు, గేమిసింగ్, చందర్, పూరీ, సోనీ, హరిచంద్, రాంసింగ్ పాల్గొన్నారు.

ఏకగ్రీవం.. అభివృద్ధిలో ఆమడదూరం..

- ఏకగ్రీవ పంచాయతీలకు ఇప్పటికీ అందని నిధులు
- గ్రామాల్లో కుంటుపడుతున్న అభివృద్ధి
- సర్పంచ్‌లకు తప్పని నిలదీతలు

నవతెలంగాణ-మోపాల్

సర్పంచ్ ఎన్నికల్లో ఏకగ్రీవ పంచాయతీలకు రూ.10 లక్షలు ఇస్తామని చెప్పి.. ఎన్నికలు గడిచి నాలుగున్నరేండ్లు గడుస్తున్నా.. ఇప్పటికీ ఒక్క పైసా అందలేదు. ఏకగ్రీవంగా ఎన్నుకుంటే వచ్చే నిధులతో గ్రామంలో చేపట్టనున్న పలు పనులపై సర్పంచ్‌లు గ్రామస్తులకు హామీ ఇవ్వగా.. ప్రస్తుతం ఆ నిధులు రాకపోవడంతో సర్పంచ్‌లకు నిలదీతలు తప్పడం లేదు. కొందరు తప్పని పరిస్థితుల్లో తమ సొంత నిధులతో పలు హామీలను అమలు చేసిన పరిస్థితి నెలకొంది. ఫలితంగా సర్పంచ్ ఎన్నికకు పోటీ చేయాలంటేనే జంకే పరిస్థితి నెలకొంటుంది.

ఏకగ్రీవంగా ఎన్నికైతే గ్రామానికి నిధులు వస్తాయనే ఆశతో పలు పంచాయతీలు ఏకగ్రీవానికి ముందుకు వచ్చాయి. మోపాల్ మండలంలో 21 గ్రామపంచాయతీలు ఉండగా 8 గ్రామపంచాయతీల్లో సర్పంచ్ ఎన్నిక ఏకగ్రీవం చేసుకున్నాయి. వాటిల్లో 4 గ్రామాలు కొత్తగా పంచాయతీలుగా ఏర్పడ్డవే. గిరిజన గ్రామాలే ఎక్కువ. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయానికి ముందు ఏకగ్రీవంగా ఎన్నికైతే రూ.10 లక్షల నజరానా ప్రకటించింది. ఎన్నికల ఖర్చు తగ్గించి ఆ నిధులను గ్రామాల అభివృద్ధికి కేటాయిస్తామని చెప్పడంతో చాలా గ్రామాలు ముందుకు వచ్చాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటనతో పాటు ఎమ్మెల్యేలు ఏకగ్రీవ పంచాయతీలకు రూ.5 లక్షల నుంచి పది లక్షల వరకు ఎమ్మెల్యే నిధులు కేటాయిస్తామని ప్రకటించారు.


గ్రామపంచాయతీ కార్యాలయం

పోటీకి దూరమవుతున్న యువత

ఒకప్పుడు చాలామంది యువత రాజకీయాల్లోకి వచ్చి గ్రామ సర్పంచ్ గా పోటీ చేయాలని ఆశాభావం వ్యక్తం చేస్తుండేవారు. కానీ ఇప్పుడున్న పరిస్థితి చూస్తుంటే యువత ముందుకు వచ్చే అవకాశమే లేకుండా పోయింది. చిన్న గ్రామపంచాయతీలో ఎన్నికకు పోటీ చేద్దామన్నా సుమారు రూ.10 లక్షల నుంచి 20 లక్షల వరకు వెచ్చించాల్సి వస్తున్నట్టు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఆర్థిక స్తోమత ఉన్నవారే తప్ప మిగతావారు పోటీ చేద్దామని ఆలోచన కూడా చేయలేకపోతున్నారు.

అలా కాకుండా కొన్ని ప్రాంతాల్లో గ్రామ కమిటీ తీర్మానాలు చేసి కూడా ఎంతో కొంత డబ్బులని గ్రామానికి ఇచ్చి ఏకగ్రీవంగా సర్పంచులుగా ఎన్నికవుతున్నారు. గ్రామ కమిటీ కూడా ఏకగ్రీవంగా తీర్మానించడం వల్ల గ్రామానికి ఏకగ్రీవ నిధులు వచ్చి తమ గ్రామాన్ని అభివృద్ధి చేసుకోవచ్చని ఉద్దేశంతో ఇలా చేస్తున్నారు. అటువంటి ఆశలు కూడా అడియాశలు అయ్యాయి. ఏకగ్రీవ నజరానా ఇవ్వకపోవడంతో మరోసారి పోటీలో నిలిచేందుకు వెనకడుగువేస్తున్నారు. చాలామంది సర్పంచులు ప్రశ్నిద్దామను అనుకుంటున్నా.. ఎక్కడ ఎమ్మెల్యేల దృష్టిలో, రాష్ట్ర నాయకుల దృష్టిలో పడతామోనని భయంతో ఎక్కడా ప్రశ్నించడంలేదని పేర్కొంటుండటం గమనార్హం.

రానున్న ఎన్నికల్లో ఏకగ్రీవాలు అనుమానామే..

వచ్చే గ్రామపంచాయతీ ఎలక్షన్స్‌లో ఏకగ్రీవం అంటే నమ్మే పరిస్థితిలో లేక ఎన్నికల కమిషన్ ఎన్ని ప్రయత్నాలు చేసిన ఏకగ్రీవ కోసం రానున్న పంచాయతీ ఎలక్షన్లో ఏ గ్రామ పంచాయతీ కూడా ఏకగ్రీవం అయ్యేటట్టు కనబడటం లేదు. ఒకవేళ ఏకగ్రీవ గ్రామపంచాయతీలకు నిధులు అందిస్తే ఆ గ్రామాన్ని ఆదర్శంగా తీసుకొని మిగిలిన గ్రామాలు కూడా తమ గ్రామన్ని కూడా ఏకగ్రీవం చేసుకుంటే రాష్ట్ర తమ గ్రామానికి కూడా ఏకగ్రీవ నిధులు వస్తాయని మా గ్రామాన్ని కూడా అభివృద్ధి చేసుకుంటామని ఆలోచన ఉండేది. కానీ ఇప్పుడున్న పరిస్థితిలో ఏ ఒక్క గ్రామ పంచాయతీ కూడా నిధులు ఇవ్వకపోవడంతో ఏకగ్రీవం అనే మాటే కనుమరుగ అయ్యే పరిస్థితి రానుంది. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఏకగ్రీవ పంచాయతీలకు నజరానా చెల్లించాలని గ్రామస్తులు, సర్పంచ్‌లు కోరుతున్నారు.

ప్రజాఉద్యమాలకు చిరునామా గద్దర్

- ఆయన మరణం పట్ల పలువురి నివాళి


నివాళి అర్పిస్తున్న పలువురు

నవతెలంగాణ-విలేకరులబృందం

గద్దర్‌తో మమేకం కానీ ప్రజా ఉద్యమాలు ఏవి లేవని, ప్రజల పక్షాన నిలిచి అలుపెరుగకుండా పోరాటం సాగించిన గద్దర్ జీవితం త్యాగాలతో కూడుకున్నదని పలువురు కొనియాడారు. ఆయన మృతిచెందడం పట్ల ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా గద్దర్‌తో తమకున్న అనుబంధాలను నెమరేసుకున్నారు.

కంఠేశ్వర్ : నగరంలోని కేర్ డిగ్రీ కళాశాలలో పలువురు కవులు గద్దర్‌కు నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ప్రముఖ కవి పంచ రెడ్డి లక్ష్మణ మాట్లాడారు. చెన్నారెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత గద్దర్ నిజామాబాద్‌లో నిర్వహించిన సభ చారిత్రాత్మకమని ఆయన జ్ఞాపకం చేసుకున్నాను. పాటల రచయితగా గాయకుడిగా వెరసి ప్రజా వాగ్గేయకారునిగా వైతాళికునిగా ప్రజల హృదయంలో గద్దర్ చిరస్థాయిగా నిలిచిపోతాడని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ కవులు ఘనపురం దేవేందర్, డాక్టర్ కాసర్ల నరేష్ రావు, దారం గంగాధర్, తిరుమల శ్రీనివాసార్య, బాగుల యాదగిరి, మద్దుకూరి సాయిబాబు, ఆర్. మధు, సందీప్ తదితరులు నివాళి అర్పించారు.

గద్దర్‌కు విప్లవ జోహార్లు


సదాశివనగర్ : మండలంలోని పలువురు గద్దర్‌కు విప్లవ జోహార్లు తెలిపారు. ఆయన మరణవార్త వినగానే ఆదివారం దిగ్రాంతి గురయ్యామని తెలిపారు. మేధావులు, కర్షకులు, కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణ కోసం పేదల కోసం ఎన్నో పోరాటాలు చేశారని కొనియాడారు.

ఉద్యమ నేతను కోల్పోయాం



నిజామాబాద్ రూరల్ : ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ యూకే చాప్టర్ ప్రధాన కార్యదర్శి సుధాకర్ గౌడ్, గద్దర్ ముదిపట్ల తీవ్ర సంతాపం వెలిబుచ్చారు. ఈ జాతి ఒక ఉద్యమనేతను కోల్పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా యుద్ధనౌకగా పేరొందిన గద్దర్ మరణం యావత్ తెలంగాణకు తీరని లోటని పేర్కొన్నారు. తన యావత్ జీవితం గద్దర్ సమ సమాజ స్థాపన కోసం బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం పాటుపడ్డారని కొనియాడారు. తన ఆటపాటతో ఎన్నో ఉద్యమాలు నిర్మించారాని తెలంగాణ ఉద్యమంలో గద్దర్ పాత్ర చిరస్మరణీయం అజరామరం అని అన్నారు. గద్దర్‌తో పలు ఉద్యమాల్లో పాల్గొన్న తన అనుబంధాన్ని సుధాకర్ గౌడ్ పంచుకున్నారు.

మున్నూరుకాపు అధ్యక్షులుగా బొమ్మల లక్ష్మణ్



నవతెలంగాణ-బిచ్కుంద

బిచ్కుంద మండల కేంద్రంలోని మున్నూరు కాపు సంఘం కళ్యాణ మండపంలో మున్నూరు కాపు కులస్తుల సమక్షంలో నుతన సంఘం అధ్యక్షులుగా బోమ్మల లక్ష్మణ్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా సాయిని అశోక్, బాసబాలు, ప్రధాన కార్యదర్శిగా పుల్లెన్ వెంకట్, నారం సంజు, కోశాధికారిగా తమ్లూర్ సంతోష్, బొల్లి నారాయణ, సంయుక్త కార్యదర్శిగా సాయిని అశోక్, హాజి గోపి తో పాటు గణేష్ ఉత్సవాల కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షులు బొమ్మల లక్ష్మణ్ మాట్లాడుతూ సంఘం సభ్యుల సహకారంతో అందరిని కలుపుకొని సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని, మున్నూరు కాపు కులస్తులకు ఎలాంటి సమస్యలు వచ్చినా తన దృష్టికి తీసుకురావాలని సమస్యల పరిష్కరించేందుకు కృషి చేస్తానని అన్నారు.

క్విట్ఇండియా ఉద్యమ స్ఫూర్తితో దేశాన్ని కాపాడుకుందాం

- కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను ప్రతిఘటిద్దాం
- సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్‌వీ రమ
- 9,10వ తేదీల్లో మహాపడావ్ ఆందోళనలు జయప్రదం చేయాలని పిలుపు



మహాపడావ్ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో దేశాన్ని కాపాడుకుందామని, కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను ప్రతిఘటిద్దామని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఎస్వీ రమ పిలుపునిచ్చారు. ఆదివారం సీఐటీయూ కార్యాలయంలో యూనియన్ జిల్లా విస్తృత సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగాఎస్వీ రమ హాజరయ్యారు. ఈ సందర్భంగా 9,10వ తేదీల్లో జరిగే మహా పడావ్ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్వీ రమ మాట్లాడుతూ.. నరేంద్ర మోదీ నాయకత్వంలోని కార్పొరేట్ అనుకూల కేంద్ర బిజెపి ప్రభుత్వం బరితెగించి అమలు చేస్తుందని, ప్రజా, కార్మిక వ్యతిరేక పరిపాలన సాగిస్తున్నదని తెలిపారు. 'జాతీయ సహజ వనరులు, ప్రభుత్వరంగ సంస్థలను కారుచౌకగా స్వదేశీ, విదేశీ కార్పోరేట్లకు అమ్మేస్తున్నది. డీజిల్, పెట్రోల్, వంటగ్యాస్, ఇతర నిత్యావసర సరుకుల ధరలు పెంచి ప్రజల నడ్డివిరిచింది. పార్లమెంట్లో మూడు రైతాంగ వ్యతిరేక చట్టాలను నిరంకుశంగా ఆమోదించుకున్నప్పటికీ కార్మిక, కర్షక ఉద్యమంతో ఆ చట్టాలను ఉపసంహరించుకున్నది. అయినా 2015లో నరేంద్ర మోడీ పార్లమెంట్లో ఇచ్చిన కనీస మద్దతు ధర హామీ నేటికీ అమలు కాలేదు. 2023-24 కేంద్రం బడ్జెట్ లో వ్యవసాయ రంగానికి, ఆహార ఉత్పత్తులకు సబ్సిడీలకు భారీగా కోతలు విధించింది. జిడిపిలో విద్యా రంగానికి 6 శాతం, వైద్య రంగానికి 2 శాతం కేటాయించకుండా నిర్లక్ష్యం చేసింది. ప్రభుత్వ కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా జరుగుతున్న ఉద్యమాలపై ఉక్కుపాదం మోపింది. పౌరుల ప్రాథమిక హక్కులను పాతరేస్తున్నది. ఉపాధి, నిరుద్యోగం, అధిక ధరలు, ఆకలి, అసమానతలు, ఆరోగ్య రక్షణ లాంటి ప్రాథమిక సమస్యలను జటిలం చేస్తున్నది. ఈ నేపథ్యంలో 9 ఏళ్ళ మోడీ ప్రభుత్వ కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ అఖిల భారత కార్మిక సంఘాల పిలుపులో భాగంగా క్విట్ ఇండియా డే ప్రచార క్యాంపెయిన్ను ఆగస్టు 9, 10 తేదీల్లో నిజామాబాద్ జిల్లాలో ఆగస్టు 9న కొత్త కలెక్టర్ కార్యాలయం వద్ద ఆగస్టు 10న లేబర్ కార్యాలయం వద్ద చేపట్టనున్నట్టు' తెలిపారుఉ. మహాధర్నా కార్యక్రమాలు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శంకర్ గౌడ్ నూర్జహాన్, జిల్లా ఉపాధ్యక్షులు ఈవీఎల్ నారాయణ, గోవర్ధన్, జంగం గంగాధర్, సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు కటారి రాములు, సాగర్ రేణుక, నరసయ్య, రాజేశ్వర్ పద్మ తదితరులు పాల్గొన్నారు.

ఎక్కడికక్కడ ఎస్ఎఫ్ఐ నాయకుల అరెస్ట్

- ఎస్ఎఫ్ఐ ఛలో అసెంబ్లీ పిలుపు పట్ల ప్రభుత్వానికి భయమెందుకో...?
- విద్యారంగ సమస్యల పరిష్కరించాలి
- జిల్లా కార్యదర్శి బోడ అనిల్ డిమాండ్

నవతెలంగాణ-కంఠేశ్వర్

కొట్లాడి తెచుక్కున తెలంగాణలో అక్రమంగా అరెస్ట్ చేయడం అప్రజాస్వామ్యమని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) జిల్లా కార్యదర్శి బోడ అనిల్ అన్నారు. విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఛలో అసెంబ్లీకి ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ పిలుపు ఇవ్వగా.. పలువురు నాయకులను పోలీసులు ఆదివారం ముందస్తుగా అరెస్టు చేశారు. విద్యార్థి ఉద్యమాలకు భయపడి నిజామాబాద్ జిల్లా కేంద్రంతో పాటు జిల్లా వ్యాప్తంగా ఎస్ఎఫ్ఐ నాయకులను మందస్తుగా అరెస్టు చేశారన్నారు. తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ సమావేశాలలో విద్యా రంగం గురించి చర్చించి సమస్యలు పరిష్కారం చేయాలని అన్నారు. నూతన విద్యావిధానం 2020 తెలంగాణ రాష్ట్రంలో అమలు చేయకుండా అసెంబ్లీలో తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో గత మూడేళ్ళుగా 5,177 కోట్లు పెండింగ్ స్కాలర్ షిప్స్, పెండింగ్ రీయింబర్స్‌మెంట్స్ విడుదల చేయలేదని, గురుకులాలు, కెజిబివిలు, మోడల్ స్కూల్స్ లో సమస్యలు అలాగే ఉన్నాయని తెలిపారు. మెస్ బిల్లులు విడుదల చేయలేదని, యూనివర్శిటీలలో ఫీజులు పెంచి ఉన్నత విద్యకు దూరం చేస్తుందని, ప్రైవేట్ విద్యాసంస్థలలో భారీగా పెంచిన ఫీజులు, విద్యారంగంలో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీ, తగ్గిన నిధులు కేటాయింపు, గురుకులాలకు సొంత భవనాలు నిర్మాణం చేయాలని,ఈ అంశాలపై అసెంబ్లీలో చర్చించి పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో బిజెపి తెస్తున్న నూతన విద్యావిధానం అమలు చేయలేమని తీర్మానం చేయాలని అన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బోడ అనిల్, నగర కార్యదర్శి మహేష్, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పెద్ది సూరి, నాయకులు గణేష్, విశాల్, బోధన్, తెలంగాణ యూనివర్సిటీలో ఎస్ఎఫ్ఐ నాయకులను, అక్రమంగా అరెస్టు చేశారన్నారు. వారందరినీ విడుదల చేయాలని లేని పక్షంలో ఈ ప్రభుత్వం పోరాట సెగని అనుభవించాల్సి వస్తుందని అన్నారు.


ఎస్ఎఫ్ఐ నాయకులను అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించిన పోలీసులు

మాజీ ఎమ్మెల్యే కామన్ మ్యాన్‌లా..

నవతెలంగాణ-బోధన్

ఈ ఫొటోలో ఉన్న వ్యక్తి కామన్ మ్యాన్ కాదు.. మాజీ ఎమ్మెల్యే సాంబశివరావు చౌదరి. ఈయన పేరు తెలియని వారు ఉండరు. నేటి కాలంలో వార్డు నెంబర్, సర్పంచ్ అయితేనే ఖద్దరు బట్టలు వేసి హంగామా చేసే నాయకులు ఉన్నారు. కానీ ఈయనది సాదాసీదా జీవితం. పేదలను సమస్యల పరిష్కారానికి ఇప్పటికీ ఆయన వారికి సహాయం చేస్తూనే ఉంటారు. రెండు రోజుల క్రితం ఓ మహిళకు పింఛన్ మంజూరు కోసం బోధన్ మండల పరిషత్ కార్యాలయానికి స్వయంగా వచ్చి ఆ మహిళకు అండగా నిలిచారు. ఈ సందర్భంగా ఆయనను నవ తెలంగాణ విలేకరి పలుకరించగా ఆయన చేసిన సేవలను వివరించారు. 1983 - 84, 85లో ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో ఆయన ఎమ్మెల్యేగా పనిచేసినట్లు తెలిపారు. ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ప్రభుత్వం ద్వారా 500 రూపాయల వేతనం వచ్చేదని, ప్రస్తుతం ప్రభుత్వ మంజూరి చేసిన 50 వేల రూపాయలు పెన్షన్ అందుకుంటున్నానని తెలిపారు. అందులోనూ 90శాతం తన వద్ద గతంలో పనిచేసిన నిరుపేదలకు ఇస్తున్నానని, మిగిలిన 10శాతంతో నెల రోజులపాటు జీవనం కొనసాగిస్తున్నానని ఆయన తెలిపారు. ఇప్పటికంటే గతంలోని రాజకీయాలు నయమని, ప్రస్తుతం ప్రజలు చైతన్యవంతం కావాలని, రాజకీయ నాయకుల వద్ద మోసపోవద్దని తన అభిప్రాయం వ్యక్తం చేశారు. ప్రజల అభీష్టం మేరకు ప్రస్తుత ఎన్నికల్లో స్వతంత్రంగా ప్రజల తరపున రానున్నట్లు తన మనసులో మాట వెల్లడించారు.


సాంబశివరావు చౌదరి

ప్రొఫెసర్ జయశంకర్‌కు నివాళి


ఎల్లారెడ్డి మున్సిపల్ కార్యాలయంలో..

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి మున్సిపాలిటి కార్యాలయంలో ఆదివారం మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ సాధనలో జయశంకర్ గారి పాత్ర ఎంతో కీలకమైంది అని ఆయాన కృషి వల్లె తెలంగాణ సాదించుకున్నామని అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జీవన్ , మున్సిపాలిటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

లింగంపేట్ : మండల కేంద్రంలో విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ప్రొఫెసర్ జయశంకర్ జయంతిని వేడుకలను మండల అధ్యక్షులు కమ్మరి పండరి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర జెయింట్ సెక్రెటరీ వడ్ల రామచందర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు కమ్మరి వెంకటేశం, మండల వైస్ ప్రెసిడెంట్ కమ్మరి రాజులు, మండల నాయకులు కమ్మరి కొండేష్, బ్రహ్మం శ్రీకాంత్ పాల్గొన్నారు.

దోమకొండ : తెలంగాణ మార్గ నిర్దేశకుడు రాష్ట్ర సాధన దిక్సూచి ప్రొఫెసర్ జయశంకర్ అని ఎంపిపి కానుగంటి శారద నాగరాజు , జడ్పీటిసి తీగల తీర్మల్ గౌడ్ అన్నారు. దోమకొండ మండల పరిషత్ కార్యాలయంలో ఆయన జయంతి వేడుకలు నిర్వహించారు. ప్రతి ఒక్కరు జయశంకర్ ఆశయాల కోసం ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమం లో ఎంపిటిసి కడారి రమేష్, నిమ్మ శంకర్, కోట సదానంద , కో ఆప్షన్ శామ్మి , సర్పంచ్ నల్లపు అంజలి శ్రీనివాస్, ఉపసర్పంచ్ గజవడ శ్రీకాంత్ పాల్గొన్నారు.

జుక్కల్ : ప్రొ. జయశంకర్ గొప్ప మహనీయుడని, ఆదర్శ ప్రాయుడని ఖండేభల్లూర్ గ్రామస్తులు అన్నారు. ఆదివారం నాడు ఖండేబల్లూర్ గ్రామములోని గ్రామపంచాయతి కార్యాలయము ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జీపీ వార్డు సభ్యులతో పాటు బీఆర్ఎస్ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు. జుక్కల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు శివరాజ్ దేశాయి మాట్లాడారు.

మహంతంలో పిచ్చికుక్క దాడి

- ముగ్గురికి తీవ్రగాయాలు

నవతెలంగాణ-నవీపేట్



మండలంలోని మహంతం గ్రామంలో పిచ్చికుక్క ఇద్దరు పిల్లలు, ఒక వృద్ధురాలితో పాటు పశువులపై దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. ముగ్గురు పిల్లలు నీరడీ కార్తికేయ, మెట్టు వైష్ణవి, మెట్టు సుజాతను చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తీసుకెళ్లారు. గ్రామంలో పిచ్చికుక్కల బెడద తీవ్రం కావడంతో నివారించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

కాంగ్రెస్ ఫ్లెక్సీ చింపిన వారిపై ఫిర్యాదు

నవతెలంగాణ- బోధన్

సాలూర మండల కేంద్రంలో మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డి జన్మదినం సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు ఏర్పాటుచేసిన ఫ్లెక్సీని శనివారం రాత్రి గుర్తుతెలియని దుండగులు ఆ ఫ్లెక్సీని చించడంతో కాంగ్రెస్ పార్టీ నాయకులు బోధన్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం ఫిర్యాదు చేశారు. మాజీ మంత్రి ఫ్లెక్సీని చించిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని మండల్ కిసాన్ సెల్ అధ్యక్షులు మందర్నా రవి, అల్లే రమేష్, మండల్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు అశోక్, రాష్ట్ర యూత్ కాంగ్రెస్ కార్యదర్శి రవీందర్ రెడ్డి, ఇల్తెపు రమేష్, దేవురావు, ప్రకాష్, మోహన్,లక్ష్మణ్, ప్రకాష్ డిమాండ్ చేశారు.

రాష్ట్ర సాధనలో జయశంకర్ కృషి మరువలేనిది

- తెలంగాణ జాతిపితకు ఘన నివాళ్లు
- ప్రొఫెసర్ జయశంకర్ 89వ జయంతి

తెలంగాణ జాతిపిత సిద్ధాంతకర్త, ఆచార్య కొత్తపల్లి జయశంకర్ 89వ జయంతి ఆదివారం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రం కోసం అనునిత్యం పరితపించి, స్వరాష్ట్ర సాధనే లక్ష్యంగా, మలిదశ ఉద్యమానికి వారధియై, తన చివర శ్వాస వరకు అలుపెరుగని పోరాటం చేసి, తెలంగాణ ప్రజల హృదయాల్లో చిరస్మరణీయంగా నిలిచిన మహనీయుడు ఆచార్య కొత్తపల్లి జయశంకర్ అని పలువురు పేర్కొన్నారు.

నవతెలంగాణ-విలేకరులు

కంఠేశ్వర్:నిజామాబాద్ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో కమిషనరేట కార్యాలయంలో ప్రొఫెసర్ జయశంకర్ సార్ 89వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జయశంకర్ ఫోటోకు పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. అనంతరం అదనపు పోలీస్ కమిషనర్ గిరి రాజ్ మాట్లాడుతూ 1934 ఆగష్టు 6న వరంగల్ జిల్లా ఆత్మకూర్ మండలం అక్కంపేట గ్రామంలో జన్మించారని, 1952లో ముల్కీ ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారని తెలిపారు. 1954లో రాష్ట్రాల పునర్విభజన కమిషన్ ముందు వాదించారని, కాకతీయ యూనివర్సిటీ వైస్ చాన్సలర్‌గా పనిచేశారని అన్నారు. 2001 టీఆర్ఎస్ సైద్ధాంతిక పునాదిని తయారు చేశారు. భౌగోళిక తెలంగాణను సాధించుకొన్న తరువాతే మిగతాకోణాలపై దృష్టిపెట్టాల్సి ఉంటుందని చెప్పేవారని అన్నారు. కార్యక్రమంలో అదనపు పోలీస్ కమీషనర్ (ఎ.ఆర్) గిరారాజ్, సిసిఆర్‌బి సిఐ సురేందర్ రెడ్డి రిజర్వు ఇన్స్‌పెక్టర్స్ వెంకటప్పలనాయుడు, స్పెషల్ బ్రాంచ్ ఎస్.ఐ బాల్సింగ్ నాయక్, ఆఫీస్ సూపరింటెండెంట్లు, పోలీస్ కార్యాలయం సిబ్బంది, సి.సి.ఆర్.బి సిబ్బంది, సి.ఎస్.బి సిబ్బంది ఐ.టి కోర్ సిబ్బంది, పోలీస్ కంట్రోల్ రూమ్ సిబ్బంది, సెల్‌సెల్ సిబ్బంది హాజరయ్యారు.

రాష్ట్ర సాధనలో జయశంకర్ సార్ కృషి మరువలేనిదని మేయర్ దండు నీతుకిరణ్ అన్నారు. తెలంగాణ సిద్ధాంత కర్త ఆచార్య జయశంకర్ సార్ జయంతి సందర్భంగా నగరంలోని కంఠేశ్వర్ లోగల విగ్రహానికి పూలమాల సమర్పించి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నుడా ఛైర్మన్ ప్రభాకర్ రెడ్డి , బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కిషన్ రావ్ , కార్పొరేటర్ మల్లేష్ యాదవ్, నూడా నాయకులు రవి చందర్, అక్తర్ ఖాన్, రమేష్, శివ సాధిక్ తదితరులు పాల్గొన్నారు.

బోధన్ టౌన్:బోధన్ వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహమ్మద్ షకీల్ ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో డైరెక్టర్ వినోద్ నాయక్, సిబ్బంది ఉన్నారు.

సిరికొండ:సత్యశోధక్ పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్. నర్సయ్య ఆధ్వర్యంలో పాఠశాలలో జయశంకర్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

ఆర్మూర్:భారత్ జాగృతి నియోజకవర్గ అధ్యక్షులు మక్కల సాయినాథ్, ఉపాధ్యక్షులు డాక్టర్ డ.శ్రీనివాసబాలు ఆధ్వర్యంలో పట్టణంలో జయశంకర్ ఫోటోకు పూలమాల వేసి నివాళులు అర్పించారు.

భారత్ జాగృతి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జాగృతి జెండా ఎగురవేసి ఆవిర్భావ వేడుకలు ఘనంగానిర్వహించి అరటిపండ్లు,స్వీట్లు పంచడం జరిగింది.

పట్టణంలోని మామిడిపల్లి విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు

కమ్మర్‌పల్లి: మండలంలోని చౌట్ పల్లిలో స్థానిక విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

డిచ్‌పల్లి:తెలంగాణ యూనివర్సిటీలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ప్రొఫెసర్ జయశంకర్ సార్ జయంతిని ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సిహెచ్. ఆరతి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పలువురు పూలమాలవేసి నివాళులర్పించారు. జయశంకర్ సార్ కొనసాగించిన విలువలను, ఉద్యమ స్ఫూర్తిని, సంఘటిత ఆలోచనలు, ప్రజాస్వామిక భావజాల వ్యాప్తిని, మరింత ముందుకు తీసుకుపోవాలని పేర్కొన్నారు.

వేల్పూర్:మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో జయశంకర్ జయంతిని పురస్కరించుకొని జీపీ పాలకవర్గం సభ్యులు, విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు, గ్రామస్తులు జయశంక్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. తన ఆలోచన విధానాన్ని తెలంగాణ కోసమే ఉపయోగించిన గొప్ప మార్గదర్శిఅని, తెలంగాణకు మార్గాన్ని దిశా నిర్దేశం చేసిన తెలంగాణ మరో గాంధీ అని ఉప సర్పంచ్ పిట్ల సత్యం అన్నారు. తెలంగాణ పునర్నిర్మాణంలో వారి ఆశయాలను నెరవేరుస్తామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఆర్టిఏ మెంబర్ రేగుల రాములు, ఆత్మ చైర్మన్ నోముల రవీందర్, బి.ఆర్.ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు ప్రతాప్, విద్యార్థి నాయకులు శ్రీనివాస్ గౌడ్, తెలంగాణ ఉద్యమకారుడు మండాది దయాకర్ ,విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు, యువజన విభాగం నాయకులు పాల్గొన్నారు

వర్ని:మండలం విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో జయశంకర్‌సార్ జయంతిని జరిపారు. జయశంకర్ తెలంగాణకు దిక్సూచి అని తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ వెలగపూడి గోపాల్, పంచాక్షరీ, మంచి విట్టల్, సత్యనారాయణ, అంజయ్య,శంకర్ పాల్గొన్నారు.

నందిపేట్:మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద భారత రాష్ట్ర సమితి పార్టీ ఆధ్వర్యంలో జయశంకర్ సార్ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా మచ్చర్ల సాగర్ మాట్లాడుతూ...... తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తన లక్ష్యంగా జీవించిన మహోన్నత వ్యక్తి తెలంగాణ సిద్ధాంతకర్త జయశంకర్ సార్ అని గుర్తు చేశారు.

నిజామాబాద్‌సిటీ:తెలంగాణ ఉద్యమంలో ప్రొఫెసర్ జయశంకర్ సార్ పాత్ర చిరస్మరణీయమని టిపిఎల్ఎఫ్ నాయకులు అన్నారు. తెలంగాణ ప్రైవేట్ లెక్చరర్స్ ఫోరమ్ (టిపిఎల్ఎఫ్) ఆధ్వర్యంలో నిజామాబాద్ నగరంలోని స్థానిక కంఠేశ్వర్ సర్కిల్ వద్ద ప్రొఫెసర్ జయశంకర్ సార్ విగ్రహానికి పూలమాలలు వేసి ఆయన త్యాగాలను గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో టిపిఎల్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు యు.శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి ముంజ మల్లికార్జున్ గౌడ్, నగర అధ్యక్షులు సి.గజానంద్, కార్యదర్శి స్వామి, నాయకులు, ప్రైవేట్ అధ్యాపకులు పాల్గొన్నారు.



కంఠేశ్వర్ : నివాళ్లు అర్పిస్తున్న మేయర్



కంఠేశ్వర్ : పోలీసుల ఆధ్వర్యంలో...



కమ్మర్‌పల్లిలో..



నందిపేట్‌లో..



బోధన్‌టౌన్ : ఏఎంసీలో నివాళ్లు అర్పిస్తూ...



ఆర్మూర్ : నివాళ్లు అర్పిస్తున్న జాగృతి నాయకులు



వేల్పూర్‌లో..

విద్య, వైద్యం ఉచితంగా అందించడమే ఆమ్ ఆద్మీ పార్టీ లక్ష్యం

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ



నియామక పత్రం అందజేస్తున్న మఠంల శేఖర్

విద్య వైద్యం ఉచితంగా అందించడమే ఆమ్ ఆద్మీ పార్టీ లక్ష్యమని ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా అధ్యక్షుడు మఠంల శేఖర్ అన్నారు. రాష్ట్ర కన్వీనర్ దిడ్డి సుధాకర్, పార్లమెంటరీ కన్వీనర్ బుర్ర రాము గౌడ్ చేతుల మీదుగా హైదరాబాద్‌లో శనివారం పార్టీ కార్యాలయంలో నియామక పత్రాన్ని అందుకున్నానని తెలిపారు. ఆదివారం ప్రెస్ క్లబ్ ఏర్పాటుకచేసిన సమావేశంలో జిల్లా కో కన్వీనర్‌గా సమీర్, అర్బన్ మైనారిటీ ఇన్‌ఛార్జిగా అజారుద్దీన్, యూత్ అధ్యక్షులు కావూరి శ్రీనివాస్‌కు నియామక పత్రాలను మఠంల శేఖర్ అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ అధ్యక్షులు ఢిల్లీ ముఖ్యంత్రి కేజ్రీవాల్ విద్య, వైద్యం ఉచితంగా అందించడమే లక్ష్యంగా అడుగులు వేస్తున్నారన్నారు. అక్కడ ఉచిత నీరు, విద్యుత్ ఇవ్వడం అభినందనీయం అన్నారు. ప్రజల సమస్యలను పరిష్కారం దిశగా అడుగులు వేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు పండరి, దీగంబర్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం చేయడంలోనే తృప్తి

- పెళ్లికి సహాయం చేసిన మాజీ ఎంపీపీ ఇమ్మడి గోపి



ఆర్థికసాయం అందజేస్తున్న ఇమ్మడి గోపి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

పేదలు నిరుపేదలకు ఆర్థిక సహాయం చేయడంలోనే తృప్తి ఉందని, పెళ్లి చేయడానికి డబ్బులు లేవని పలువురు ఆయన దృష్టికి తీసుకొని వచ్చిన వెంటనే తనవంతుగా పదిహేను వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని ముదిరాజ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, దర్పల్లి మాజీ ఎంపీపీ ఇమ్మడి గోపి ఆదివారం అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు. ఇందల్ వాయి మండలంలోని సంస్థాన్ సిర్నాపల్లి గ్రామానికి చెందిన స్వామి గౌడ్ ఆర్థిక పరిస్థితి బాగా లేక కూతురికి పెళ్లి చేయలేని పరిస్థితిలో ఉండడంతో కులస్తులు ఆర్థిక సహాయం చేశారు. పెళ్లి కి ఇంకా డబ్బులు లేక ఆ కుటుంబం దిగులు చెందింది. ఈ విషయాన్ని ఇమ్మడి గోపి దృష్టికి తీసుకొని వచ్చారు. దీంతో ఆ కుటుంబాన్ని పరామర్శించి పెళ్లి ఖర్చుల కోసం పదిహేను వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ నవీన్ గౌడ్,పిల్లలెందుకు వి సహకార సొసైటీ మాజీ చైర్మన్, కోమటి రాములు, రాకేష్, కోండ రాములు, కుల పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

బోరు డ్రిల్లింగ్ పనులు ప్రారంభం



బోరు వేయిస్తున్న సంఘం సభ్యులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని చౌట్ పల్లి విశ్వబ్రాహ్మణ సంఘంలో బోరు డ్రిల్లింగ్ పనులను రైతుబంధు సమితి గ్రామ కో ఆర్డినేటర్ కొమ్ముల రాజేందర్ ఆదివారం ప్రారంభించారు. సంఘ భవనంలోని పాత బోర్ పనిచేయకపోవడంతో సంఘంలో ఏమైనా కార్యక్రమాలు చేసుకోవడానికి నీటి సమస్యతో ఇబ్బందులు అవుతున్నాయని స్థానిక బిఆర్ఎస్ నాయకుల దృష్టికి తీసుకువచ్చారు. ఒక బోర్ ఇప్పిస్తే బాగుంటుంది అని సంఘం తరపున కోరగా వెంటనే రైతుబంధు సమితి గ్రామ కో ఆర్డినేటర్ సొంత నిధులతో బోరు వేయించారు. ఆయనకు సంఘ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు ఆరెల్లి నవీన్ గౌడ్, గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు తోట శ్రీధర్, రంజిత్, ముత్తన్న, రాజుల కృష్ణ మురళి, విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు గుండోజి కర్ణ, కార్యదర్శి పోలేపల్లి సాయిరాం, కోశాధికారి సజ్జనపు బ్రహ్మయ్య, మాజీ అధ్యక్షులు బిజ్జారపు అంజయ్య, సంఘ సభ్యులు, పాల్గొన్నారు.

వృద్ధ దంపతులకు ప్రజాసేవ సైన్యం సహకారం

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ



సరుకులు, సిలెండర్ అందజేస్తున్న ప్రజాసేవ సైన్యం వారు

ఆరోగ్యం సహకరించక, వయసు మీద పడడంతో ఎటువంటి ఉపాధి లేక ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటూ జీవనం కొనసాగిస్తు, వృద్ధులకు ప్రజాసేవ సైన్యం సహకారం అందించింది. నగరంలోని కోటగల్లి బంగారు మైసమ్మ సమీపంలో 70 సంవత్సరల పైబడిన ఇద్దరు వృద్ధ దంపతులు వల్లకాటి కిషన్, వల్లకాటి సుభద్ర లు ఎన్నో సంవత్సరాలుగా అద్దె ఇంట్లో నివసిస్తున్నారు. కిషను రెండుసార్లు ఆపరేషన్లు చేయించుకున్నారు, వారికి స్వంత స్థిరాస్తులాంటు ఏమీ లేవు అని, మొన్నటి వరకు కుటుంబ సభ్యులు కూతురు, బంధువులు వీరికి ఎంతోకొంత తోచిన సహాయం చేశారు. ఇప్పుడు ఎవరి సంసార బాధ్యతలు వారికి ఉన్నాయంటూ ఆర్థిక భారం కావడంతో ఎలాంటి సహాయం అందడంలేదు. వారిలో ఒకరికి పింఛను డబ్బులు 2016 రూపాయలు వస్తున్నాయి అవి రూమ్ కిరాయి(1500), కరెంటు బిల్లు కే సరిపోవడంతో వారి తమ్ముడు శ్రీహరి, ప్రజా సేవ సైన్యం వ్యవస్థాపకుడు విఠల్‌ను సంప్రదించారు. సేవా సంస్థ నుండి వెంటనే స్పందించిన విఠల్ వారికి వంట చేసుకునేందకు గ్యాస్ సిలిండర్, 25 కేజీ ల బియ్యం, పప్పులు, నూనె, నిత్యవసరాల సరుకులను ఆదివారం అందించారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



చెక్కులు అందజేస్తున్న నాయకులు

నవతెలంగాణ-ఏర్గట్ల

మండలకేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ చేశారు. మండలాధ్యక్షుడు పూర్ణానందం,ఎంపీపీ ఉపేందర్ రెడ్డి, జడ్పీటీసి గుల్లే రాజేశ్వర్ చేతుల మీదుగా ఏర్గట్లకు చెందిన వి.నర్సుకు 25,500, ఆర్.శ్రీనివాస్ కు 26500, టి.రాజుకు 36 వేలు, తొర్తి గ్రామానికి చెందిన తాహెర్‌కు 60 వేలు, తాళ్ళ రాంపూర్ గ్రామానికి చెందిన ఎస్.నర్సయ్యకు 35 వేలు, ఎం .గంగాధర్‌కు 20,500, దోంచందకు చెందిన పవన్‌కు 34,500 ఏడుగురికి 2 లక్షల 38 వేల రూపాయలను అందజేశారు. కార్యక్రమంలో నాయకులు తుపాకుల శ్రీనివాస్ గౌడ్,బద్దం శ్రీనివాస్ రెడ్డి,కూశ లింబాద్రి, లక్కం నర్సయ్య, గన్నారపు రాజేశ్వర్, బోనగిరి రమేష్, ఓర్సు రాములు, పొదేండ్ల మల్లయ్య, బొమ్మకంటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'కమీషన్ల' చెక్ డ్యాములు

- కాంగ్రెస్ నాయకులు ముత్యాల సునీల్ కుమార్

నవతెలంగాణ-మోర్తాడ్



మాట్లాడుతున్న సునీల్‌రెడ్డి

మండలంలోని పెద్దవాగు ప్రాంత గ్రామాల్లో నిర్మించిన చెక్ డ్యాములు మంత్రి కమిషన్ల కోసమే నిర్మించారని రైతులకు ప్రజలకు, ఉపయోగపడే విధంగా నిర్మిస్తే బాగుండేదని కాంగ్రెస్ నేత ముత్యాల సునీల్ కుమార్ రెడ్డి అన్నారు. ఆదివారం ధర్మోరా, దొనకల్ గ్రామాలలో నిర్మించిన చెక్ డ్యాంలను ఆయన పరిశీలించారు. చెక్ డ్యాంలు సరిగ్గా నిర్మించలేదని, దీంతో పంట పొలాలు నీటమునిగాయని అన్నారు. పంటలు నష్టపోయినా ఎందుకు పరిశీలించలేదని ప్రశ్నించారు. రైతు పంట పొలాలు నష్టపోలేవంటూ అసెంబ్లీలో మంత్రి అబద్ధపు మాటలు మాట్లాడటం సరికాదని అన్నారు. నాసిరకం చెక్ డ్యాముల నిర్మాణంతో పంట పొలాలు కోల్పోయిన రైతులకు 30 వేల నష్టపరిహారం అందించాలని అన్నారు. ఫోటోలకు ఫోజులు ఇవ్వకుండా పెద్దవాగు ప్రాంతంలోని చెక్ డ్యాముల వద్ద పంట పొలాలను పరిశీలించాలని మంత్రికి హితవు పలికారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు రాములు, రాజశేఖర్, నాయకులు పాల్గొన్నారు.

ప్రజాగాయకుడు గద్దర్‌కు విప్లవ జోహార్లు

గద్దర్ మృతి పట్ల బాజిరెడ్డి దిగ్భ్రాంతి

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి/ఆర్మూర్

ప్రముఖ ప్రజా గాయకులు కవి గద్దర్ మృతి పట్ల - టిఎస్ఆర్టిసి చైర్మన్, నిజామాబాద్ గ్రామీణ నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీ బాజిరెడ్డి గోవర్ధన్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గద్దర్‌గా పేరొందిన విఠల్ రావు కవిగా, ప్రజా గాయకుడిగా ప్రజలను చైతన్య పరిచారని అన్నారు. గద్దర్ మరణం తెలంగాణ సమాజానికి తీరని లోటని, ఆయన కుటుంబ సభ్యులకు అభిమానులకు తన ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

ఆర్మూర్:విప్లవ ప్రజాసాంస్కృతిక సేనాని కామ్రేడ్ గద్దర్ కు విప్లవ జోహార్లు అని సిపిఐఎంఎల్ రాష్ట్ర నాయకులు ప్రభాకర్ నివాళ్లు అర్పించారు. గద్దర్ మరణం వార్త తెలియగానే ప్రజాపంథా డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో డివిజన్ కార్యదర్శి.దేవారం అధ్యక్షతన ఆదివారం పట్టణంలోని కుమార్ నారాయణ భవన్‌లో సంస్మరణ సభను నిర్వహించారు. గద్దర్ దశాబ్ద కాలంగా ప్రజల గుండెల్లో నిలిచి పోయేలా విప్లవ గేయాలను రాసి సొంతంగా ఆడిపాడిన ప్రజాకళాకారుడుఅని అన్నారు. పాటను తూటాల మార్చిన విప్లవ పాటల గుండె చప్పుడని తెలిపారు అన్నారు. పోలీసుల ఆయన్ను చంపాలని కాల్చిన వెన్నులో తూట దిగిన వెన్ను చూపని వాడు గద్దర్ అని తెలిపారు. ఆయన స్ఫూర్తితో కళాకారులూ ప్రజల వైపు నిలవాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధానకార్యదర్శి %ూ%. రామకృష్ణ, అరుణోదయ రాష్ట్ర ఉపాధ్యక్షులు కె. గంగాధర్, పి ఓ డబ్ల్యు జిల్లా అధ్యక్షురాలు గోదావరి, పి డి ఎస్ యు రాష్ట్ర అధ్యక్షులు పెద్దింటి:రామకృష్ణ, ప్రధానకార్యదర్శి నామాల: ఐఎఫ్టియు జిల్లా అధ్యక్షులు. ముత్తెన్న. సురేష్ పాల్గొన్నారు.



ఆర్మూర్‌లో మాట్లాడుతున్న ప్రభాకర్

గద్దర్ అంత్యక్రియలు ప్రభుత్వ లాంఛనాలతో జరపాలి : కాంగ్రెస్

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

ప్రజా గాయకుడు గద్దర్ అంత్యక్రియలు ప్రభుత్వ లాంచనాలతో జరపాలని తెలంగాణ పీసీసీ అధికార ప్రతినిధి బాస వేణుగోపాల్ యాదవ్ ఆదివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. మలి దశ తెలంగాణ ఉద్యమాన్ని ప్రారంభించి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు వరకు అహర్నిశలు శ్రమించిన ప్రజా యుద్ధ నౌక గద్దరన్న మృతి తీరని లోటని పేర్కొన్నారు. ప్రభుత్వం ఆయన అంత్యక్రియలను అధికార లాంచానాలతో జరపాలని కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నదని తెలిపారు. గద్దరన్న సేవలను తెలంగాణ ప్రజలు గుండెల్లో ఉంచుకున్నారని, ఆయన మృతికి సంతాపంగా సోమవారం సెలవు దినంగా ప్రకటించాలని కోరారు.

ప్రజా గాయకుడు గద్దర్‌కు ఆర్మూర్‌తో అనుబంధం

నవతెలంగాణ-ఆర్మూర్



గద్దర్‌తో గంట సదానందం

ప్రజా గాయకుడు గద్దర్ మరణం తీవ్ర విషాదాన్ని నింపిందని పట్టణానికి చెందిన మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ గంట సదానందం ఆదివారం తెలిపారు. 1963, 70లో నిజాంకొడుకు హాస్టల్ అయిన ముజాలా బాయ్ సోషల్ వెల్ఫేర్ హాస్టల్లో గంటసదానందం, గద్దర్ ఒకే రూములో ఉండి చదువుకున్నట్టు తెలిపారు. పట్టణంలోని తన స్వగృహానికి గద్దర్ వచ్చినట్టు తెలిపారు.

ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించాలి మాలమహానాడు డిమాండ్

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ



ప్రజా గాయకుడు గద్దర్ అంత్యక్రియలు ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహించాలని మాల మహానాడు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నాగరాజు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గద్దర్ తెలంగాణ ప్రజల ఆలోచనలకు తగినట్టుగా ఉద్యమస్ఫూర్తిని నింపారని, బడుగు బలహీన వర్గాలను బలపరిచేందుకు ఆయన రచనలతో, గానాలతో ఉద్యమ స్ఫూర్తిని రగించారని తెలిపారు. గతంలో మృతి చెందిన సాయన్న, సాయి చందులకు ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించలేదని అన్నారు. ప్రజా గాయకుడు గద్దర్ అంత్యక్రియలు ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహించాలని డిమాండ్ చేశారు.

ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో బోనాల ఊరేగింపు

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని పెద్ద మల్లారెడ్డి గ్రామంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం బోనాల పండగను ఘనంగా నిర్వహించారు. గ్రామ శివారులో గల గ్రామదేవతలకు ఆర్యవైశ్య సంఘం మహిళలు బోనాలను సమర్పించి మొక్కులు తీర్చుకుని, అన్ని వర్గాల ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని వేడుకున్నారు. అనంతరం గ్రామ శివారులో గల పెద్దమ్మ ఆలయం వద్ద వనభోజనాలు నిర్వహించారు.


బోనాలు ఊరేగింపులో మహిళలు

గ్రంథాలయానికి భవనం నిర్మించండి

- జిల్లా గ్రంథాలయ చైర్మన్‌కు వినతి

నవతెలంగాణ-గాంధారి

గాంధారి మండల కేంద్రంలో గ్రంథాలయానికి నూతన భవనం నిర్మించాలని తొమ్మిదవ వార్డ్ మెంబర్ నితిన్ పాటిల్ ఆధ్వర్యంలో కామారెడ్డి జిల్లా గ్రంథాలయ శాఖ చైర్మన్ రాజేశ్వరరావుకు ఆదివారం వినతిపత్రం అందజేశారు. నితిన్ పాటిల్ మాట్లాడుతూ గాంధారి లో ఉన్న గ్రంథాలయ బిల్డింగ్ శిథిలావస్థకు చేరడంతో అక్కడినుండి తాత్కాలికంగా రైతు సంఘంలోకి మార్చినట్టు తెలిపారు. పాత బిల్డింగ్ కూల్చివేసి కొత్త బిల్డింగ్ నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ యువకులు పాల్గొన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న పలువురు

మీ సేవలు మరువబోం

- ఘనంగా ప్రొ.జయశంకర్ జయంతి వేడుకలు
- చిత్రపటాలకు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళి

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

మండల పరిషత్ కార్యాలయంలో తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలు ఎంపీపీ ప్రతాప్ రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం జయశంకర్ సార్ తన జీవితాంతం కష్టపడ్డారని, తెలంగాణ భావజాల వ్యాప్తికి నిరంతరం కృషి చేశారని తెలిపారు. జయశంకర్ ఆశయాల సాధనకు చిత్తశుద్ధితో తెలంగాణ ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ప్రత్యేక రాష్ట్ర సాధనలో ఆయన చేసిన సూచనలు, సలహాలు భవిష్యత్ తరాలకు మార్గదర్శకాలుగా నిలుస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ప్రతాప్ రెడ్డి, సర్పంచ్ తిరుమలరెడ్డి, బిఆర్ఎస్ యూత్ మండల ప్రెసిడెంట్ చిప్ప రమేష్, హనుమంత్ రెడ్డి, ప్రేమ్ సింగ్, పంచాయతీ సెక్రటరీలు శివాజీ, సుజాత పాల్గొన్నారు

గాంధారి :

గాంధారి మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో ప్రొపెసర్ జయశంకర్ జయంతి పురస్కరించుకుని ప్రొపెసర్ జయ శంకర్ సర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యులు శంకర్ నాయక్, సొసైటీ చెర్మెన్ సాయి కుమార్, గాంధారి మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు గాంధారి సర్పంచ్ మమ్మాయి సంజీవ్ యాదవ్, ఏఎంసి వైస్ చెర్మెన్ రెడ్డిరాజు, ఎంపిటిసి సభ్యులు పత్తి శ్రీనివాస్, కోఅప్షన్ మెంబర్ ముస్తప్ప వార్డుసభ్యులు నితిన్ పాటిల్ నాయకులు శివాజీ రావు, జింగురు సురేష్, తూర్పు సంతోష్, హెూటల్ శ్రీను, చాకలి శ్రీను, సాయిబాబా, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

పిట్లం: తెలంగాణ జాతిపిత, సిద్ధాంతకర్త ఆచార్య ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలను ఆదివారం మండల పరిషత్ కార్యాలయం, విశ్వబ్రాహ్మణుల ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లు అర్పించి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రానికి దశ, దిశను నిర్దేశించిన గొప్ప సిద్ధాంతకర్తయని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, విశ్వబ్రాహ్మణులు వడ్ల సత్యనారాయణ , వడ్ల దత్తు , హన్మాండ్లు , శ్రీధర్ , రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బిచ్కుంద : బిచ్కుంద మండలంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో (అటానమస్) జయశంకర్ సార్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యాపకులు జయశంకర్ సార్ చిత్రపటానికి పూలమాలతో నివాళు లర్పించారు. అధ్యాపకులు మాట్లాడుతూ జయశంకర్ సార్ తెలంగాణ భావజాల వ్యాప్తికి నిరంతరం కృషి చేసిన రచయిత, వక్త, మహెూపాధ్యాయులని తెలంగాణ సిద్ధాంతకర్తగా, ఉద్యమ స్ఫూర్తి ప్రదాతగా తెలంగాణ ప్రజల గుండెల్లో శాశ్వతంగా నిలిచిపోయారని అన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలు

తాడ్వాయి: కామారెడ్డి కలెక్టర్ కార్యాలయంలో ఆదివారం ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మను చౌదరి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రొఫెసర్ జయశంకర్ తన జీవితమంతా తెలంగాణ ఉద్యమానికి, స్వరాష్ట్ర ఏర్పాటు కు అంకితం చేసిన వ్యక్తి అని కొనియాడారు. ఆయన ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరు తమ వంతు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు నరాల వెంకటరెడ్డి, కార్యదర్శి బి. సాయిలు, ఆర్గనైజింగ్ కార్యదర్శి సంతోష్ కుమార్, ప్రతినిధులు దేవరాజ్, శ్రీనివాస్ రెడ్డి, జుగల్ కిషోర్, లక్ష్మణ్, సాయిలు పాల్గొన్నారు.


కామారెడ్డి కలెక్టరేట్‌లో నివాళి అర్పిస్తున్న అడిషనల్ కలెక్టర్, అధికారులు


పిట్లంలో


పెద్దకొడప్‌గల్ మండల పరిషత్ కార్యాలంయంలో..


బిచ్కుందలో..


గాంధారిలో నివాళి అర్పిస్తున్న పలువురు

స్నేహితుడి కుటుంబానికి అండగా ఉంటాం


ఫిక్స్‌డ్ డిపాజిట్ బాండ్ అందజేస్తున్న చిన్ననాటి మిత్రులు

నవతెలంగాణ-భిక్కనూర్

చిన్ననాటి నుండి కలిసి చదువుకున్న నాగర్తి నరేష్ రెడ్డి కుటుంబానికి అండగా ఉంటామని భిక్కనూరు బాలుర ఉన్నత పాఠశాల 2002 బ్యాచ్ చెందిన స్నేహితులు హామీ ఇచ్చారు. భిక్కనూర్ మండలం రామేశ్వర్ పల్లి గ్రామానికి చెందిన నాగర్తి నరేష్ రెడ్డి గత జూన్ నెలలో వ్యక్తిగత కారణాలతో ఆత్మహత్య చేసుకోగా పదవ తరగతి బ్యాచ్‌కు చెందిన స్నేహితులందరు కలిసి రూ.36000 జమ చేసి అతడి కుమార్తె నక్షత్ర పేరు పైన పోస్ట్ ఆఫీస్‌లో ఫిక్స్ డిపాజిట్ చేశారు. దీనికి సంబంధించిన బాండ్‌ను ఆదివారం స్నేహితులందరం కలిసి నరేష్ రెడ్డి భార్య మమతకు అందజేశారు. ఈ కార్యక్రమంలో నరేష్ రెడ్డి స్నేహితులు లింగారెడ్డి, నీలేందర్ రెడ్డి, లక్ష్మణ్, శ్రీధర్, నరేష్, సందీప్, స్వామి, ధర్మారెడ్డి,సతీష్, అనిల్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామపంచాయతీగా ఏర్పాటు పట్ల హర్షం


చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న గ్రామస్తులు

నవతెలంగాణ-గాంధారి

మండలంలోని పిస్యాల్‌గుట్టతండాను గ్రామపంచాయతీగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడంతో తండా వాసులు హర్షం వ్యక్తం చేశారు. ఆదివారమిక్కడ సీఎం కేసీఆర్‌తో పాటు ఎల్లారెడ్డి ఎమ్మెల్యే సురేందర్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. తండాను గ్రామపంచాయతీగా ఏర్పాటు చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యులు శంకర్ నాయక్, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు గాంధారి సర్పంచ్ మమ్మాయి సంజీవ్ యాదవ్, నాయకులు శివాజీ రావు,ముకుంద్ రావు,మోతీరం తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ నాయక్‌పోడ్ మండల కమిటీ ఎన్నిక


ఎన్నికైన కమిటీ

నవతెలంగాణ-లింగంపేట్

లింగంపేట్ మండల ఆదివాసి నాయక్‌పోడ్ మండల కమిటీని ఆదివారం లింగంపేట్ మండల కేంద్రంలో మండల స్థాయి సమావేశం నిర్వహించి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నిక జిల్లా అధ్యక్షుని ఆధ్వర్యంలో ఎన్నిక జరిగింది.లింగంపేట్ మండలం ఆదివాసీ నాయక్‌పోడు మండల కమిటీ అధ్యక్షునిగా మచ్చ సాయిలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా మేడి సాయిలు ప్రధాన కార్యదర్శి నూక లక్ష్మణ్ కోశాధికారి కొత్తపల్లి రాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు మెట్టు పెంటయ్య మాట్లాడుతూ ఆదివాసి హక్కుల కోసం పోరాటం చేయాలన్నారు. కలిసికట్టుగా ఉండి జాతి సమస్యల కోసం ముందుకు పోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు మెట్టు పెంటయ్య జిల్లా ఉద్యోగుల సంఘం అధ్యక్షులు సాయిలు, పుట్ట వెంకట్, పుట్ట రాములు, వివిధ గ్రామాలకు చెందిన నాయక్ పోడ్ కులస్తులు తదితరులు ఉన్నారు.

సుష్మ స్వరాజ్‌కు వర్ధంతి నివాళి


నివాళి అర్పిస్తున్న బీజేపీ నాయకులు

నవతెలంగాణ-లింగంపేట్

భారతీయ జనతా పార్టీ మండల కార్యాలయంలో ఆదివారం సుష్మా స్వరాజ్ వర్ధంతి నివాళి అర్పించారు. ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బిజెపి మండల అధ్యక్షులు జక్సాని దత్తు రాములు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఆవశ్యకతపై జాతీయస్థాయిలో ఎలుగెత్తిన తెలంగాణ చిన్నమ్మ ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి కేంద్ర మంత్రి శ్రీమతి సుష్మాస్వరాజ్ పార్లమెంట్లో తెలంగాణ కొరకై మొట్టమొదటిసారిగా గలమెత్తారని కొనియాడారు. తెలంగాణ ఏర్పాటు కొరకు విద్యార్థులు ఆత్మబలిదానం చేసుకుంటే సుష్మాస్వరాజ్ తెలంగాణ వచ్చే వరకు నేను మీ వెంటే ఉంటా మీరు ఆత్మబలిదానం చేసుకోవద్దు అని ధైర్యము చెప్పి తెలంగాణ రాష్ట్రం వచ్చేవరకు పోరాటం చేసి తెలంగాణ ఏర్పాటుకు కారణమయ్యారని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు జక్సాని దత్తురాములు, మండల ప్రధాన కార్యదర్శి వడ్ల రామచందర్, కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు బొల్లారం సాయిలు, కిసాన్ మోర్చా మండల అధ్యక్షులు రాజారం, బాలయ్య పట్టణ అధ్యక్షులు నవీన్, బిజెపి సీనియర్ నాయకులు పెద్దిశివయ్య, జక్సాని విట్టల్, ఎన్నార్ వెంకటి, నరేష్ రంజిత్ కుమార్ పాల్గొన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

నవతెలంగాణ-సదాశివనగర్

మండల సర్వసభ్య సమావేశం సోమవారం ఉంటుందని ఎంపిడిఓ లక్ష్మీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని శాఖల అధికారులు పూర్తి సమాచారంతో హజరు కావాలని తెలిపారు. మండలంలోని సర్పంచ్‌లు ఎంపిటిసి లు సకాలంలో హజరై విజయవంతం చేయాలని తెలిపారు

12 యూనిట్ల గొర్రెలు దిగుమతి


గొర్రెల యూనిట్లు వచ్చిన లారీ వద్ద అధికారులు, లబ్దిదారులు

నవతెలంగాణ-పిట్లం

మండలంలోని బండాపల్లి గ్రామ గొల్ల , కుర్మాలకు 12 యూనిట్ల గొర్రెలు దిగుమతి అయినట్లు పశువైద్యాధికారి సంతోష్ ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండవ విడత గొర్రెల పంపిణీ కార్యక్రమంలో భాగంగా మండలంలోని గొల్ల, కుర్మాలకు మండలానికి 622 యూనిట్లకు గాను 13 వేల 050 గొర్రెలు అవసరము కాగా విడతల వారీగా అందనున్నాయన్నారు. ముందుగా బండాపల్లి గ్రామంలో 80 మంది గొల్ల , కర్మలు అర్హులు కాగా 12 యూనిట్ల కు సబ్సిడీ డబ్బులు చెల్లించినందున వారి నిమిత్తం 252 గొర్రెలను ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం నుంచి దిగుమతి అయినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో గొర్రెల లబ్ధిదారులు పాల్గొన్నారు.

అసెంబ్లీలో ఎమ్మెల్యే ప్రకటన పట్ల ఆగ్రహం

- గిరిజన సంఘాల ఆధ్వర్యంలో ధర్నా


ఎమ్మెల్యే దిష్టిబొమ్మ దహనం చేస్తున్న గిరిజనులు

నవతెలంగాణ-గాంధారి

బీసీ అయినటువంటి కాయితిలంబాడీలను ఎస్టీ జాబితాలో చేర్చాలని శనివారం అసెంబ్లీలో ఎల్లారెడ్డి నియోజకవర్గ ఎమ్మెల్యే సురేందర్ మాట్లాడటంపై గాంధారి మండల కేంద్రంలో మండలంలోని వివిధ తండాలను చెందిన గిరిజనులు కామారెడ్డి బాన్స్‌వాడ రహదారిపై ధర్నా నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే సురేందర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా గిరిజన నాయకుడు అనిల్ కుమార్ మాట్లాడుతూ మా గిరిజనులపై కక్ష కట్టి ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని, తక్షణమే వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గిరిజన బిడ్డలందరికీ ఎమ్మెల్యే సురేందర్ క్షమాపణ చెప్పాలని గిరిజన నాయకులు డిమాండ్ చేశారు.

రాజ్యాధికార సాధన కోసం ఛలో కోరుట్ల

- పద్మశాలి రాజకీయ యుద్ధభేరి పోస్టర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-ఆర్మూర్ /జక్రాన్‌పల్లి

సమానత్వం, రాజ్యాధికార సాధన కోసం ఈ నెల 13న జరిగే ఛలో కోరుట్ల పద్మశాలి రాజకీయ యుద్ధభేరిలో పాల్గొని పద్మశాలీల సత్తా చాటుకోవాలని బిజ్జు దత్తాద్రి పిలుపునిచ్చారు. మున్సిపాలిటీ పరిధిలోని పెర్కిట్‌లో నూతనంగా నిర్మిస్తున్న కళ్యాణ మండపంలో చలో కోరుట్ల సందర్భంగా ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమం పద్మశాలి మండలాధ్యక్షులు బొడ్డు గంగాధర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈసందర్భంగా ముఖ్య అతిథులుగా బిజ్జు దత్తాద్రి, విశిష్ట అతిథులుగా పట్టణ అధ్యక్షులు అంబల్ల శ్రీనివాస్, గుజ్జేటి రాము, ఆలూర్ నూతన మండల అధ్యక్షులు చిల్క జ్ఞానేశ్వర్ ,ప్రత్యేక ఆహ్వానితులుగా గోసికొండ అశోక్, ఆర్మూర్ మండల కార్యవర్గ కార్య నిర్వాహక ప్రతినిధులు మండల ప్రధాన కార్యదర్శి బండారి ప్రసాద్ , కోశాధికారి చిట్ల యజ్ఞేశ్ పాల్గొన్నారు. ఛలో కోరుట్ల కార్యక్రమానికి రెండు మండలాలలోని పద్మశాలీలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ముఖ్యఅతిథి బిజ్జు దత్తాద్రి మాట్లాడుతూ వస్త్రోత్పత్తి రంగంలో పద్మశాలీల సృజనాత్మకతకు జాతీయ, అంతర్జాతీయ గుర్తింపు లభించిందని తెలిపారు. సామాజికంగా, ఆర్థికంగా, సాంస్కృతికంగా సాహిత్య రంగంలో పద్మశాలీలు ప్రముఖ పాత్ర పోషిస్తున్నారని, రాజకీయ శూన్యతను అధిగమించ దానికి ఐక్యతతో ముందడుగు వేయాలని తెలిపారు. కార్యక్రమంలో హలో పద్మశాలి.. ఛలో కోరుట్ల.. అనే ఏకవాక్య తీర్మానం చేశారు.

జక్రాన్‌పల్లి : పద్మశాలి రాజ్యాధికార సాధనలో భాగంగా ఈనెల 13న తలపెట్టిన పద్మశాలి రాజకీయ యుద్ధభేరి పోస్టర్ మండల కేంద్రంలోని పద్మశాలి సంఘంలో మండల పద్మశాలి సంఘం ప్రతినిధులు ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిజామాబాద్ రూరల్ పద్మశాలి కన్వీనర్ దాస్ మాట్లాడుతూ.. పద్మశాలి ఆత్మగౌరవ సభను పద్మశాలీలు విజయవంతం చేయాలని కోరారు. రాజకీయ పార్టీలకు అతీతంగా నిర్వహిస్తున్న ఈ సభకు పద్మశాలి యువతీ యువకులందరూ పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని అన్నారు. మండల పద్మశాలి సంఘం అధ్యక్షుడు శేఖర్ మాట్లాడుతూ మండలంలోని ప్రతి గ్రామం నుంచి అధిక సంఖ్యలో పద్మశాలి పాల్గొని కోరుట్ల సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ రూరల్ అధ్యక్షుడు లోలం జగదీష్, మండల యువజన సంఘం అధ్యక్షుడు అంకం నరేష్, జిల్లా చేనేత సంఘం కార్యదర్శి ప్రసాద్ అధ్యక్షులు చాట్ల శ్యామ్, పద్మశాలి ప్రతినిధులు శ్రీనివాస్ సత్యనారాయణ లక్ష్మణ్, రాజు, పద్మశాలి కుల బాంధవులు పాల్గొన్నారు.


ఆర్మూర్‌లో వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

రూ.53 కోట్లతో నిజామాబాద్ రేల్వేస్టేషన్ పునరాభివృద్ధి

- పనులకు అట్టహాసంగా శంకుస్థాపన

నవతెలంగాణ-నిజామాబాద్

అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద రైల్వే స్టేషన్లలో చేపట్టనున్న పునరాభివృద్ధి పనులకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రిమోట్ సిస్టం ద్వారా శంకుస్థాపన చేశారు. ఈ పథకం కింద మొదటి విడతలోనే నిజామాబాద్ రైల్వే స్టేషన్ ఎంపికవగా, ఆధునికీకరణ పనుల కోసం 53.3 కోట్ల రూపాయలను వెచ్చించనున్నారు.

ప్రధాని నరేంద్ర మోదీ దేశవ్యాప్తంగా అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద 508 రైల్వే స్టేషన్ల అభివృద్ధికి ఏకకాలంలో రిమోట్ విధానం ద్వారా శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో దక్షిణ మధ్య రైల్వే హైదరాబాద్ డివిజన్ డీ.ఆర్.ఎం లోకేష్ విష్ణోయి, సీనియర్ డీ.సీ.ఎం బాలాజీ కిరణ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బస్వా లక్ష్మీనర్సయ్య తదితరులు పాల్గొన్నారు. ప్రత్యక్ష ప్రసారం ద్వారా శంకుస్థాపన కార్యక్రమాన్ని వీక్షించి, ప్రధాని నరేంద్ర మోదీ, రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ ల ప్రసంగాన్ని ఆసక్తిగా ఆలకించారు.

రైల్వే మంత్రిత్వ శాఖ రూపొందించిన అమృత్ భారత్ స్టేషన్ స్కీం లో భాగంగా రైల్వే స్టేషన్లను ఆధునీకరించడం, దీర్ఘకాలిక దృష్టితో నిరంతర ప్రాతిపదికన అభివృద్ధిని సాధించాలనే లక్ష్యంతో నిర్దేశిత పనులు చేపట్టనున్నారు. అత్యాధునిక వసతులను అందుబాటులోకి తెస్తూ, ప్రయాణీకులకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించనున్నామని రైల్వే అధికారులు తెలిపారు. మెరుగైన లైటింగ్, సర్క్యులేటింగ్ ప్రాంతం అందుబాటులోకి తేవడం, అప్‌గ్రేడ్ చేసిన పార్కింగ్ స్థలం, దివ్యాంగులకు అనుకూలమైన మౌలిక సదుపాయాలు, గ్రీన్ ఎనర్జీని ఉపయోగించడం ద్వారా పర్యావరణ అనుకూల, సదుపాయాలు, ఆకట్టుకునేలా స్టేషన్ డిజైన్ తదితర పనులతో కూడిన ప్రతిపాదనలు రూపొందించారు. ఈ పనులతో ప్రయాణికులకు ఎంతో మెరుగైన సదుపాయాలు అందుబాటులోకి రానున్నాయని హైదరాబాద్ డివిజన్ డీఆర్ఎం లోకేష్ ఆశాభావం వ్యక్తం చేశారు. అధునాతన వసతులు, ఆహ్లాదకరమైన వాతావరణం ప్రయాణికులకు చక్కటి అనుభూతిని అందిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో దక్షిణ మధ్య రైల్వే డీ.ఈ.ఎన్ శశాంక్, సీనియర్ డీ.ఎస్.సి అనూప్ కుమార్ శుక్లా, వివిధ శాఖలకు చెందిన జిల్లా జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రతిమారాజ్, ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇందిరా, ట్రాన్స్ కో ఎస్.ఈ రవీందర్, జిల్లా కార్మిక శాఖ అధికారి యోహాన్, జిల్లా సంక్షేమ అధికారిణి రసూల్ బీ, నాయకులు, స్థానికులు, పురప్రముఖులు, ప్రయాణికులు, రైల్వే అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న లోకేష్ విష్ణోయ్


హాజరైన నాయకులు

పీహెచ్‌సీకి నూతన 108 వాహనం

నవతెలంగాణ-రెంజల్


పీహెచ్‌సీకి వచ్చిన అంబులెన్స్

ప్రజలకు అత్యవసర సేవలను అందించేందుకు 108 నూతన వాహనం రెంజల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చింది. గతంలో పనిచేసిన వాహనాలు తరచుగా పాడవుతుండడంతో మహారాష్ట్ర నుంచి నూతన వాహనాలను ప్రభుత్వం కొనుగోలు చేసింది. ఒక్కొక్క వాహనానికి సుమారు 20 లక్షల వరకు ఖర్చు అయి ఉండవచ్చునని 108 సిబ్బంది పేర్కొన్నారు. మండలంలో అన్ని గ్రామాలతో పాటు అవసరాల నిమిత్తం ఇతర మండలాలకు కూడా సేవలను అందించనున్నట్లు పైలట్ ఏ. నాగరాజు పేర్కొన్నారు.

బీసీ ఎన్ఆర్ఐలకు అండగా ఉంటా

నవతెలంగాణ-ఆర్మూర్



బీసీ ఎన్ఆర్ఐలకు అండగా ఉంటానని బీసీ సంక్షేమ సంఘం కత్తర్ వేల్పూర్ మండల అధ్యక్షులు ఎలుక మరారి రాము గౌడ్ అన్నారు. ఎన్ఆర్ఐ కువైట్ అధ్యక్షులు బట్టు స్వామి, కత్తర్ ఉపాధ్యక్షులు గురాయి రాజేందర్ సమక్షంలో ఆయన్ను ఆదివారం ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు మాట్లాడుతూ అవకాశం ఇచ్చిన రాష్ట్ర అధ్యక్షులకు ఎల్లవేళలా రుణపడి ఉంటామని, ఎల్లవేళలా బీసీ సంక్షేమ సంఘం కోసం పాటుపడతారని తెలిపారు. కార్యక్రమంలో బీసీ నాయకులు తదితరులు పాల్గొన్నారు

కౌడిన్య గౌడ సంఘం అధ్యక్షులుగా నటరాజ్ గౌడ్

నవతెలంగాణ-ఎడపల్లి



ఎడపల్లి గ్రామ కౌడిన్య గౌడ సంఘం అధ్యక్షులుగా నటరాజ్ గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎడపల్లి గౌడ సంఘం పెద్దలు యువకులు ఆదివారం రేణుక దేవి ఆలయం ఆవరణని ఎన్నికలు నిర్వహించినట్లు నటరాజ్ గౌడ్ తెలిపారు. సంఘం సభ్యుల సమస్యలను పరిష్కరిస్తానని ఆయన స్పష్టం చేశారు. తామంతా ఏకతాటిపై ఉండి గౌడ సంఘాన్ని అభివృద్ధి పరుస్తామని ఆయన తెలిపారు. తనపై నమ్మకం నుంచి 5వ సారి గౌడ సంఘం అధ్యక్షులుగా ఎన్నుకున్న గౌడ సంఘం పెద్దలందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

చందామియా బాగ్ తండాలో తీజ్ పండుగ


తీజ్‌బుట్టలతో వెళ్తున్న యువతులు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని చందామియాబాగ్ తండాలో తీజ్ పండుగ నిర్వహించినట్టు సర్పంచ్ కిషన్ నాయక్ తెలిపారు. పాడి పశువులు ప్రజలు అందరు బాగుండాలని తీజ్ పండుగ నిర్వహిస్తున్నట్టు కిషన్ నాయక్ తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ శ్రీను నాయక్ చందా మీయాబాగ్ తాండ గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు ప్రజలు పాల్గొన్నారు.

విద్యార్థి సంఘ నాయకుల అరెస్ట్



బోధన్ : అరెస్టయిన నాయకులు

నవతెలంగాణ-బోధన్

విద్యారంగ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఉద్యమిస్తున్న విద్యార్థి సంఘ నాయకులను పోలీసులు అసెంబ్లీ ముట్టడి చేయకుండా శనివారం అర్ధరాత్రి ముందస్తు అరెస్టు చేశారు. పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్ లను, పెండింగ్ లో ఉన్న హాస్టల్ బిల్లులను విడుదల చేయాలని, ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులు, ఎంఈఓ పోస్ట్ లను భర్తీ చేయాలని విద్యారంగానికి అధిక నిధులు ఇవ్వాలని, హాస్టళ్లలో మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. విద్యా రంగ సమస్యలపై పోరాటం చేస్తున్న విద్యార్థి సంఘ నాయకులను అరెస్టు చేయడం సిగ్గు చేటని అరెస్టయిన ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు నాగరాజు, డివిజన్ కార్యదర్శి సాయికుమార్. అన్నారు.

బోధన్ టౌన్ :

విద్యారంగ సమస్యలను పరిష్కరించమంటే విద్యార్థి సంఘ నాయకులను అర్ధరాత్రి అరెస్టు చేశారని యుఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం ఉమ్మడి నిజామాబాద్ జిల్లా కార్యదర్శి సంజయ్ తల్లారే అన్నారు. అరెస్టుల వల్ల విద్యార్థి ఉద్యమాలను ఆపలేరని తెలిపారు. సంజయ్ తలరే, మంగేష్, చంద్రకాంత్, రాజు, సాయికుమార్ అరెస్ట్ అయ్యారు.

ఆర్డీవోకు ఆత్మీయ సన్మానం



ఆర్డీవోను సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-బోధన్

బోధన్ ఆర్డిఓ రాజాగౌడ్ ఆదివారం సాలుర మండలానికి వెళ్లగా సాలూర మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆత్మీయ సన్మానం నిర్వహించారు. నూతన ఆర్డీఓగా బాధ్యతలు చేపట్టి తొలిసారిగా సాలూర మండలానికి రావడంతో ఆర్డీవోను సన్మానించినట్లు నాయకులు తెలిపారు. కార్యక్రమంలో తహశీల్దార్ మమత, హున్సా సొసైటీ చైర్మన్ మందర్న రవి, నాయకులు అల్లె రమేష్, ప్రకాష్, వహీద్, శంకర్, లక్ష్మణ్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

రైతు దీక్షలో గాండ్ల సంఘం పెద్దలు

- నేడు రైతులకు మద్దతుగా స్వచ్ఛందంగా బంద్


దీక్షలో కూర్చున్న గాండ్లసంఘం పెద్దలు

నవతెలంగాణ-రెంజల్

మండల కేంద్రమైన రెంజల్ గాంధీ విగ్రహం ముందు చేపట్టిన రైతుల దీక్ష ఆదివారం నాటికి 40వ రోజుకు చేరుకుంది. గాండ్ల సంఘం పెద్దలు రైతులకు మద్దతుగా దీక్షలో పాల్గొన్నారు. మండల కేంద్రంలో పంట పొలాలకు వెళ్లే రోడ్ల మరమ్మత్తులు జరిపించే వరకు దీక్షను విరమించే ప్రసక్తే లేదని రైతులు స్పష్టం చేశారు . దీక్షలో కుల సంఘం పెద్దలు గాండ్ల భూమేష్, గాండ్ల హనుమండ్లు, గాండ్ల రాజేందర్, గాండ్ల అనిల్, గాండ్ల సందీప్, గాండ్ల గోవింద్, గాండ్ల లింగం, గాండ్ల విట్టల్, తిరుపతి బుజ్జి, చుక్క రాజు గౌడ్ తదితర పాల్గొన్నారు.

స్వచ్ఛంద బందుకు పిలుపు.

రెంజల్ మండల కేంద్రంలో రైతుల దీక్షకు మద్దతుగా సోమవారం దుకాణాలు, హొటల్లు, వ్యాపార సముదాయాలు, ప్రైవేట్ పాఠశాలలు, స్వచ్ఛందంగా మూసివేయనున్నట్లు రైతులు పేర్కొంటున్నారు.

దివ్యాంగులకు ఇంటివద్దనే పింఛన్ ఇప్పించండి

- దివ్యాంగుల కష్టాలపై అసెంబ్లీలో బాజిరెడ్డి గోవర్ధన్

నవతెలంగాణ-మోపాల్



తెలంగాణ రాష్ట్ర శాసనసభ సమావేశాలలో భాగంగా ప్రశ్నోత్తరాల సమయంలో రూరల్ ఎమ్మెల్యే, ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ దివ్యాంగుల పెన్షన్‌పై ప్రస్తావన తీసుకువచ్చారు. దివ్యాంగులకు 3116 నుండి 4,116 రూపాయలు పెంచడం శుభప్రదం అని వారిని ఆదుకోవడంలో ముఖ్యమంత్రి చూయించిన చొరవ ప్రశంసించదగినదని అన్నారు. అలాగే వారు పోస్టాఫీస్ దగ్గరికి వెళ్లి ప్రతి నెల పింఛన్ డబ్బులు తీసుకోవడం చాలా కష్టంగా మారుతుందని, తెలిపారు. తాను ప్రత్యక్షంగా చూశానని వారి బాధను చూసి చెలించిపోయానని అన్నారు. అక్కడ చాలామందితో పాటు వీరు కూడా లైన్లో వేచి ఉండడం వల్ల వాళ్లకి ఆల్రెడీ ఇబ్బందులు ఉండడంతో ఇంకా ఇబ్బందిగా గురవుతున్నారని తెలిపారు. అలా కాకుండా ప్రతినెల వారికి పోస్ట్ ఆఫీస్ వారే ఇంటికి వచ్చి ఇవ్వాల్సిందిగా మంత్రికి విన్నవించారు. కొంతమంది దివ్యాంగులు నడవడానికి కూడా ఇబ్బందులు పడుతున్నారని, వారి కోసం రాష్ట్ర ప్రభుత్వం బ్యాటరీతో నడిచే ట్రై సైకిల్ వల్ల ఇవ్వాలని, వారికి మరింత మేలు చేసిన వారం అవుతామని, వారి ఎక్కడికైనా వెళ్లాలంటే మిగతా వారిపైన ఆధారపడి ఉండాల్సి వస్తుందని తెలిపారు. బ్యాటరీ తో నడిచే ట్రై సైకిల్స్ ఇవ్వడం వల్ల వాళ్లకి ఎటువంటి ఖర్చు లేకుండా ప్రయాణించవచ్చని ఆయన చెప్పారు. వృద్ధ దంపతులు ఉంటారని, భర్తకు లేదా భార్యకు వచ్చి పెన్షన్ వయసు పైబడిన వారు మరణించిన అనంతరం వెంటనే బ్రతికున్న వారికి పెన్షన్స్ సౌకర్యాన్ని కల్పించాలని విజ్ఞప్తి చేశారు, ఈ మేరకు శాసనసభ వ్యవహారాల మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి సానుకూలంగా స్పందించి ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి వారికి న్యాయం జరిగేటట్టు చూద్దామని ఆయన సమాధానం ఇచ్చారు

పరిమితి మించిన ప్రయాణం

- ఆటోలో ఊగిసలాడుతూ ప్రయాణిస్తున్న యువకుడు

నవతెలంగాణ - బోధన్



ఆటో ప్రయాణం ప్రమాదం అని తెలిసిన ఆటో డ్రైవర్లు పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తున్నారు. నలుగురు ఎక్కవలసిన ఆటలో పదిమందికి పైగా, ఏడుగురు ఎక్కవలసిన ఆటోలు 20 మంది వరకు తరలిస్తూ ఆటోలను ఇష్టారీతిన నడుపుతున్నారు.మహారాష్ట్ర నుంచి నుంచి కూలీలను తీసుకువచ్చే ఆటో డ్రైవర్లు ఆటోలో కిక్కిరిసిపోయేలా కూలీలను ఎక్కిస్తున్నారు. కాళ్లు పెట్టె స్థలం వద్ద కూడా మహిళలను కూర్చోబెట్టి ఇబ్బందులు పెడుతున్నారు. అయినా గాని ఆటోలను పట్టించుకునే వారి లేరు. ఆర్టీవో అధికారులు, పోలీసులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికే ఎన్నోసార్లు ఆటోలో ప్రయాణించిన వారు ప్రమాదాలకు గురై మృతి చెందుతున్న సంబంధిత శాఖ అధికారులు మాత్రం ఆటో నిర్వాహకులను పట్టించుకోవడం లేదు. పది రోజుల క్రితం సాలూరు వద్ద మహారాష్ట్ర నుంచి కూలీలను తరలిస్తున్న ఆటో అదుపుతప్పి బోల్తా పడినట్లు సమాచారం. ఈ ఘటనలో ఎవరికి ప్రమాదం జరగకపోవడంతో విషయం బయటికి రాలేదు. అయినా గాని మహిళ కూలీలను ఆటలలో కిక్కిరిసి తరలిస్తున్నారు. రవాణా శాఖ అధికారులు, పోలీసు అధికారులు తక్షణమే స్పందించి పరిమితికి మించి తరలిస్తున్న ఆటోలపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

జూనియర్ ఏషియా సాఫ్ట్ బాల్ ఛాంపియన్షిప్ పోటీలకు గురుకుల విద్యార్థిని ఎల్. రాణి ఎంపిక


రాణిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఈనెల 29 నుండి సెప్టెంబర్ 02 వరకు పింగ్టన్ సిటీ, ఫిజియన్ ప్రొవైన్స్ చైనా దేశంలో జరగనున్న జూనియర్ (అండర్-18) ఏషియన్ మహిళల సాఫ్ట్ బాల్ ఛాంపియన్షిప్ పోటీలకు డిచ్ పల్లి మండలంలోని సుద్దపల్లిలోగల సాంఘిక సంక్షేమ కళాశాల క్రీడాకారిని లకావత్ రాణి ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ గోదావరి ఆదివారం తెలిపారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. ఐదవ తరగతి నుండి శిక్షణ పొంది ఇప్పటివరకు 22 సార్లు జాతీయ పోటీలలో పాల్గొని పలుమార్లు ఉత్తమ క్రీడాకారిణిగా ప్రత్యేక బహుమతులు అందుకోవడం అభినందన మన్నారు. సుద్దపల్లి కళాశాలలో కొనసాగుతున్న సాఫ్ట్ బాల్ రాష్ట్ర అకాడమీలో ప్రత్యేక శిక్షణ పొందుతుందని వివరించారు. భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ భవిష్యత్తులో ఒలంపిక్స్ క్రీడలు పాల్గొనేలా శిక్షణను ఇస్తూ ప్రోత్సహిస్తామన్నారు.కార్యక్రమంలో ప్రత్యేక ఆహ్వానితులుగా జిల్లా సాఫ్ట్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మర్కంటి గంగామోహన్ పాల్గొని మాట్లాడుతూ సాఫ్ట్ బాల్ క్రీడలో పాల్గొన్న క్రీడాకారులకు స్పోర్ట్స్ , ఉన్నత విద్య, ఉద్యోగాలలో రిజర్వేషన్ వర్తిస్తుందని పేర్కొన్నారు. ఈనెల 10 నుండి 16 వరకు చీమన్ బాగ్ స్టేడియం ఇండోర్ మధ్యప్రదేశ్ రాష్ట్రంలో జరిగే శిక్షణ శిబిరంలో ఎల్ రాణి పాల్గొననున్నదని తెలిపారు. జిల్లా నుంచి ఎల్ రాణి, ఏ ఇందు ఎంపికకవడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ మహాలక్ష్మి, వ్యాయమ ఉపాధ్యాయురాలు నల్లూరి లత, మమత, రాష్ట్ర సాఫ్ట్ బాల్ బాలికల అకాడమీ కోచ్ వేముల మౌనిక పాల్గొన్నారు.

రెజ్లింగ్ క్రీడాకారులకు అర్థిక సహాయం

- రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో

నవతెలంగాణ ఆర్మూర్


ఆర్థికసాయం అందజేస్తున్న రోటరీ క్లబ్ వారు

పట్టణంలోని రోటరీ క్లబ్ ఆఫ్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ స్థాయినేపాల్ లో జరిగే రెజ్లింగ్ (కుస్తీ) పోటీలలో పాల్గొనేందుకు వెళ్తున్న క్రీడాకారులు మహేష్, భాను ప్రసాద్‌ను రోటరీ సభ్యుల సహకారంతో 13వేల రూపాయలు రోటరీ అధ్యక్షులు పట్వారి గోపికృష్ణ ఆదివారం అందజేశారు. అంతర్జాతీయ స్థాయిలో గోల్డ్ మెడల్ సాధించి భారత దేశ ఔన్నత్యాన్ని, గొప్పతనాన్ని చాటి చెప్పాలని అన్నారు. కార్యక్రమంలో రోటరీ కోశాధికారి లక్ష్మీనారాయణ, సభ్యులు గోనె దామోదర్ , ఖాందేశ్ సత్యం, రాజన్న, శశిధర్, రాస ఆనంద్, వినాయక్, సూర్యప్రకాష్,సుధ తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుల దినోత్సవం

స్నేహితుల దినోత్సవం సందర్భంగా రోటరీ అధ్యక్షులు పట్వారి గోపికృష్ణ రోటరీ సభ్యులకు ఫ్రెండ్షిప్ బ్యాండ్స్ ని కట్టి శుభాకాంక్షలు తెలిపారు. పేద, ధనిక అనే తేడా లేకుండా కష్టసుఖాల్లో ఎల్లప్పుడూ తోడుగా ఉంటూ జీవిత ప్రయాణంలో ఒక భాగమే స్నేహం కాబట్టి ప్రతి ఒక్కరూ కలిసి మెలిసి స్నేహితులుగా ఉంటూ సేవలో ముందుండాలని వారు అన్నారు.

పారిశుధ్య కార్మికులపట్ల ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు

నవతెలంగాణ-రెంజల్


రెంజల్‌లో..


బోధన్‌లో..

పారిశుధ్య కార్మికుల పట్ల ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని, గత 32 రోజులుగా తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ దీక్ష చేస్తున్నప్పటికీ పట్టించుకోవడంలేదని సిఐటియు మండలం అధ్యక్షులు ఫసియోద్దీన్‌స్పష్టం చేశారు. ఆదివారం రెంజల్ మండల పరిషత్ కార్యాలయం ఎదుట అర్ధ నగ్నంగా నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మూడు నెలలుగా పంచాయతీ కార్మికులకు వేతనాలు ఇవ్వడం లేదని అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందిస్తూ కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించడంతోపాటు గుర్తింపు కార్డులను ఇవ్వాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో యాదగిరి, సాయిలు, మక్కయ్య, గంగమణి, లాలు, చిన్న సాయిలు, వాహబ్, నిస్సార్, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

బోధన్: గ్రామపంచాయతీ కార్మికుల సమ్మెలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఏషాల గంగాధర్ పాల్గొని కార్మికులకు సంఘీభావం తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జీపి కార్మికుల సమ్మె 32వ రోజుకు చేరిందని, ముఖ్యమంత్రి కేసీఆర్ స్పందించి కార్మికుల సమస్యలను పరిష్కరించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే నిరసనలు ఉధృతం చేసి ఉద్యమిస్తామని హెచ్చరించారు. సమ్మెలో గ్రామపంచాయతీ కార్మిక సంఘం నాయకులు సతీష్, రాము, శంకర్, పవన్, సాయిలు, గంగాధర్, మహేష్ ,పోశెట్టి, నాగన్న, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐకి నివాళి అర్పించిన సీపీ

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని సిసిఆర్‌బిలో విధులు నిర్వహిస్తున్న ఎస్ఐ దయానంద్ రావు తన స్వస్థలం భాగ్యనగర్, నిర్మల్ జిల్లాలో గుండె నొప్పి వచ్చి మృతి చెందారు. ఆదివారం ఆయన అంత్యక్రియల్లో నిజామాబాద్ అదనపు పోలీస్ కమిషనర్ (ఎల్, ఓ) ఎస్. జయరామ్ పాల్గొన్నారు. పార్థీవ దేహం వద్ద పుష్పగుచ్ఛాలతో నివాళులు అర్పించి వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. జిల్లా పోలీస్ అసోసియేషన్ అధ్యక్షులు షకీల్ పాషా, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పద్మశాలి సంఘం అధ్యక్షులుగా బండి సత్యనారాయణ

నవతెలంగాణ-డిచ్‌పల్లి

పద్మశాలి సంఘం డిచ్ పల్లి ఆర్ఎస్ బస్టాండ్ తర్ఫ సమావేశం ఆదివారం కాశీ విశ్వనాథ ఆలయంలో నిర్వహించి కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నికున్నారు. గతేడాది పాటు ఉన్న కార్యవర్గం నూతన కార్యవర్గాన్ని శుభాకాంక్షలు తెలిపారు. అధ్యక్షులుగా బండి సత్యనారాయణ, ఉపాధ్యక్షులుగా చెలిమెల భూమయ్య, కార్యదర్శిగా ఎల్ఐసి రాములు చౌకి, కోశాధికారిగా మంత్రి వెంకటి, దైవ శెట్టి, కోరండ్ల రామానుజన్, చక్రాల ఆనంద్, బండా శ్రావన్‌ను ఎన్నుకున్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు గురుకుల విద్యార్థులు ఎంపిక

నవతెలంగాణ-ఆర్మూర్

ఈనెల 2 తేదీన జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ క్రీడాకారులను ఎంపిక చేశారు. నాగారంలోని రాజారం స్టేడియంలో అండర్ 14, 16, 20 విభాగంలో ఎంపిక నిర్వహించారు. అండర్ 16 విభాగంలో ఉదయ్, అండర్ 18 విభాగంలో జావలిన్ త్రోలో జ్ఞానంకుర్ చక్కటి ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని. ఈనెల 7 8 తేదీలో వరంగల్ రాష్ట్రస్థాయి పాల్గొంటారని గురుకుల పాఠశాల ,కళాశాల ప్రిన్సిపల్ ఏ. దుర్గారెడ్డి ఆదివారం తెలిపారు ఈ సందర్భంగా. వైస్ ప్రిన్సిపల్ శ్రీధర్, సంధ్యారాణి, కళాశాల పాఠశాల బృందం మరియు వ్యాయామ ఉపాధ్యాయులు కే, రాజేందర్, అర్జున్ కోచ్ నరేష్ స్టూడెంట్స్ ను అభినందించారు.

స్నేహితుల దినోత్సవం రోజున

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

నవతెలంగాణ-వర్ని


ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

చందూర్ గ్రామంలో 1996-1997 బ్యాచ్ శ్రీ జగ్నునాద విద్యాలయంలో చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం వర్ని సిసిడిలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. స్నేహితుల రోజు కావడంతో ఒక్కరినొక్కరు ప్రేమ పూర్వకంగా పలుకరించుకొని మంచి, చెడుల గురించి అడిగి తెలుసుకొన్నారు. ఉద్యోగం, వ్యాపారం, రాజకీయం లో ఎదుగుతున్న వారి వివరాలు తెలుపుకొన్నారు. ముందుగా విద్యను బోదించిన ఉపాధ్యాయులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయుల ఆశీర్వాదం తీసుకొన్నారు. చిన్న నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు.ఈ కార్యక్రమంలో చందూర్ మండల బి ఆర్ ఎస్ అధ్యక్షులు మూడ్ అంబర్ సింగ్ తను స్నేహితులు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్ మృతులకు నివాళ్లు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

మణిపూర్‌లో జరుగుతున్న క్రిస్టియన్లపై దాడిని ఖండిస్తూ మృతి చెందిన వారి ఆత్మకు శాంతి కలగాలని, వారి కుటుంబాలకు ఓదార్పు జరగాలని రాష్ట్రంలో శాంతిభద్రతలు నెలకొల్పాలని కోరుతూ ఆదివారం డిచ్ పల్లి మండలంలోని బర్దిపూర్ చర్చిలో క్రిస్టియన్ సోదరులు, మహిళలు ప్రార్ధన చేసి క్యాండిల్స్ వెలిగించి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో రేవా జీ దినకరన్, నీరడి పద్మారావు, ఎస్ దేవరాజ్, ఎస్ పద్మారావు, ప్రభాకర్, సురేందర్, రమేష్, తోపాటు తదితరులు పాల్గొన్నారు.

ఆందోళన వద్దు.. వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే

- యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు విక్కీ యాదవ్



నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఈ సారి జరిగే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ కి ప్రజలు పట్టం కట్టే రోజులు ఎంతో దూరంలో లేవని, యువజన కాంగ్రెస్ కార్యకర్తలు అందరూ సమిష్టిగా కృషి చేయాలని, కాంగ్రెస్ పార్టీ ఏ అభ్యర్థికి టికెట్ ఇచ్చినా గెలుపే లక్ష్యంగా చేసుకుని ప్రజలకు అవగాహన కల్పించాలని యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు విక్కీ యాదవ్ అన్నారు. ఆదివారం ఇందల్ వాయి పరిధిలోని సాయిబాబా ఆలయంలో పలు గ్రామాలకు చెందిన మండలంలోని పలు గ్రామాలకు చెందిన యూత్ సభ్యులు మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు రాజన్న ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ప్రతి గడప గడపకు వెళ్లి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు రేవంత్ రెడ్డి ప్రకటించిన వాటిపై విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. అనంతరం యూత్ సభ్యుల ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు మోత్కూరి నవీన్ గౌడ్, అమ్మాజీ నరేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి గంగ కిషన్, మహిపాల్ నాయక్, శ్రీనివాస్, సాయి చందర్, వీరేందర్, నారాయణ, శంషుద్దీన్, అంబర్ సింగ్, విజయ్, వీరయ్య, రాజన్న, నవీన్ యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సిర్పూర్ కోటకు రూ.50 లక్షల మంజూరు

నవతెలంగాణ-మోపాల్

మండలంలోని సిర్పూర్ గ్రామంలో ఉన్న పురాతన కోటకు నుడా తరుపున 50 లక్షల రూపాయలు మంజూరైనట్టు సర్పంచ్ ముత్యంరెడ్డి ఆదివారం తెలిపారు. జిల్లా కేంద్రంలోని నుడా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో నిర్ణయించారని చెప్పారు. గ్రామంలో గల పురాతన కట్టడానికి సాంస్కృతికపరంగా గుర్తించి నిధులు మంజూరు చేసినందుకు రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, నుడా చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, బాజిరెడ్డి జగన్‌కు ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాతనే గ్రామాల్లో గల పురాతన కట్టడాలకు గుర్తింపు లభించిందని, చారిత్రాత్మకమైన వాటిని భావితరాలకు కూడా తెలియజేయాలని ఉద్దేశంతో ఈ 50 లక్షల రూపాయలను కోట మరమ్మత్తులకు ఉపయోగిస్తామని ఆయన తెలిపారు.

బీసీ జాతీయ మహాసభకు తిరుపతి తరలిన బీసీ నాయకులు


నవతెలంగాణ-కంఠేశ్వర్

బీసీ జాతీయ మహాసభకు బీసీ నాయకులు ఆదివారం తిరుపతి నిజామాబాద్ బయలుదేరారు. సోమవారం తిరుపతిలో జరిగే బీసీ జాతీయ సభలో పాల్గొనడానికి వెళ్లారు. ఈసందర్భంగా బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు నరాల సుధాకర్ మాట్లాడారు. జనాభాలో 60శాతం ఉన్న బీసీలకు ప్రతి దాంట్లో అన్యాయం జరుగుతుందని అన్నారు. పోరాడితేనే బీసీలు తమ హక్కులను సాధించుకోగలుగుతారని తెలిపారు. బీసీలు ఏకమైతే 100శాతం రాజ్యం సొంతమైతదన్నారు. తరలిన వారిలో మాడవేడి వినోద్ కుమార్, ధర్మనం దేవేందర్, కరిపె రవిందర్, కొయ్యాడ శంకర్, శ్రీలత, లక్ష్మీనారాయణ, శేఖర్, ప్రశాంత్, విజయ్, మహేష్, సంజీవ్ తదితరులు ఉన్నారు.

ప్రమాదకరంగా మూల మలుపులు

- సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని వినతి

నవతెలంగాణ-రెంజల్



మండలంలోని దండిగుట్ట, రెంజల్ దర్గావద్ద నున్న ఆర్అండ్‌బి రోడ్డు మూల మలుపుల వద్ద తరచుగా ప్రమాదాలు జరుగుతున్నాయి. మూల మలుపుల వద్ద ఆర్ అండ్ బి శాఖ వారు సూచిక బోర్డులను ఏర్పాటు చేసినట్లయితే వాహనదారులు వేగాన్ని తగ్గించి వాహనాలు నడుపుతారని మండల ప్రజలు కోరుతున్నారు. గతంలో ఈ మూల మలుపుల వద్ద ప్రమాదాలు జరిగాయని, ఈ విషయాలను దృష్టిలో పెట్టుకొని రోడ్డు భవనాల శాఖ ఆధ్వర్యంలో సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.